ఆత్మీయ మతిమరుపు



ఇప్పుడు నేను నమ్ముతున్నాను, ఇప్పుడు నేను నమ్ముతున్నాను,
సమస్తము సాధ్యమే, ఇప్పుడు నేను నమ్ముతున్నాను;
ఇప్పుడు నేను నమ్ముతున్నాను, ఇప్పుడు నేను నమ్ముతున్నాను,
సమస్తము సాధ్యమే, ఇప్పుడు నేను నమ్ముతున్నాను.

2 ఇప్పుడు కేవలం ఒక్క క్షణము ప్రభువుయొక్క వాక్యము కొరకు మనము నిలబడియుందాము. ఆమోసు గ్రంథమునకు త్రిప్పుదాము, ప్రవక్తయైన ఆమోసు, 3వ అధ్యాయము, 1వ వచనముతో ప్రారంభించుదాము.

3 ఆ మధురమైన కోరస్ పాటల నిమిత్తము, సహోదరి వానీట కి మరియు అన్నా జీన్ కి మరియు సహోదరి మూర్ కి నేను కృతజ్ఞతలు చెల్లించగోరుతున్నాను. నేను అక్కడ కూర్చొని మరియు దానిని వింటూ ఉండగా, అది నన్ను తిరిగి ఆ వెనుకటి రోజులలోకి తీసుకెళ్ళినది. నేను ఆలోచిస్తూ ఉన్నాను, సహోదరుడు జాక్ మరియు నేను మాట్లాడుకుంటున్నాము, వారు మనతో ఉండి, ఆ సువార్త సభలలో పాడుతూ ఉన్నప్పుడు, ఆ అమ్మాయిలు చాలా చిన్న అమ్మాయిలైయున్నారు, కేవలం పదహారు, లేదా అంతటి వయస్సుగల అమ్మాయిలైయున్నారు. ఇప్పుడు, సహోదరి అన్నా జీన్ కు ఐదుగురు పిల్లలని, నేను అనుకుంటున్నాను, మరియు సహోదరి వానీటకి—కి...ఆమె ఇద్దరు పిల్లలకి తల్లియైయున్నది. మరియు స్త్రీలారా, పదహారు సంవత్సరాలు గడిచిపోయాయి గనుక, మనం అప్పటితో పోలిస్తే, ఇప్పుడు ఆ సూర్యాస్తమయానికి నిజంగా మరింత దగ్గరగా ఉన్నాము. ఇక ఎంతో కాలం పట్టదు, మనం ఆవలికి దాటి వెళ్తాము, ఆ మహిమకరమైన సమయము.

4 ఇప్పుడు ఆమోసు 3వ అధ్యాయములో, మనము చదువుదాము.

ఓ ఇశ్రయేలీయులలారా, ఐగుప్తు దేశమునుండి నేను బయటకు రప్పించిన సమస్త కుటుంబమా, మీకు విరోధముగా, **యెహోవా** *సెలవిచ్చిన ఈ మాటను ఆలకించుడి,*

అదేమనగా భూమిమీది సకల వంశములలోను...మిమ్మును మాత్రమే నేను ఎరిగియున్నాను: గనుక మీరు చేసిన దోషక్రియను బట్టి...మిమ్మును శిక్షింతును.

సమ్మతింపకుండ, ఇద్దరు కూడి నడుతురా?

ఎర దొరకకుండానే, ఒక సింహము అడవిలో గర్జించునా? ఏమియు పట్టుకొనకుండనే, కొదమ సింహము గుహలోనుండి బొబ్బ పెట్టునా?

భూమిమీద ఒకడును ఎరపెట్టకుండ, ఒక పక్షి ఉరిలో చిక్కుపడునా? ఏమియు పట్టుబడకుండ ఉరి పెట్టువాడు వదలిలేచునా?

*పట్టణమందు బాకానాదము వినబడగా జనులకు భయము పుట్టకుండునా? **యెహోవా** చేయనిది పట్టణములో ఉపద్రవము కలుగునా?*

తన సేవకులైన ప్రవక్తలకు తన రహస్యములను బయలుపరచకుండ---ప్రభువైన యెహోవా యేమియు చేయడు.

సింహము గర్జించెను, భయపడనివాడెవడు? ప్రభువు---మాట పలికియున్నాడు, ప్రవచింపకుండువాడెవడు?

మనము మన తలలు వంచుకుందాము.

5 ప్రభువైన యేసు, ఈ నీ వాక్యము, ప్రభువా, ఈ రాత్రి మేము ఈ భాగము చుట్టూ సహవాసము కలిగియుండుము గాక. ప్రభువా, మేము ఇక్కడనుండి తీసుకొనే, ఈ పాఠమునకు ఒక పాఠ్య సందర్భమును, నీవు దయచేస్తావని మేము ప్రార్థిస్తున్నాము, మరియు అది నీకు ఘనతను తీసుకువచ్చును గాక. ప్రభువా, ఈ రాత్రి, నీ వాక్యముపై, మేము వేచియుండగా, మమ్మల్ని ఆశీర్వదించుము. వ్యాధి బాధలతో ఉన్నవారిని స్వస్థపరచుము. తప్పిపోయినవారిని రక్షించుము. ప్రభువా, భౌతికంగాను మరియు ఆత్మీయంగాను బలహీనమౌతూ, సొమ్మసిల్లుతున్నవారికి బలమును అనుగ్రహించుము. మరియు నీ సన్నిధియొక్క గొప్ప కుమ్మరింపును మాకు అనుగ్రహించుము, ఏలయనగా యేసు నామములో మేము దీనిని అడుగుచున్నాము. ఆమేన్.

6 ఈ రాత్రి దీని నుండి, నేను ఒక పాఠ్యాంశమును తీసుకొనగోరుచున్నాను: *ఆత్మీయ మతిమరుపు.*

7 రేపు, మర్చిపోకండి, రేపు రోగుల కొరకు ప్రార్థన చేయబడుతుంది. రేపు మధ్యాహ్నం రెండు గంటలకు, ప్రభువు అత్యంత గొప్ప కార్యములను చేస్తాడని మేము ఎదురుచూస్తున్నాము, మనము---మన కూటములను ప్రారంభించినప్పుడైయున్నది. ప్రార్థనా కార్డులను ఇవ్వడానికి ఆ అబ్బాయి ఇక్కడ ఉంటాడు. మరియు ప్రార్థన చేయించుకోవాలని కోరుకునే ప్రతి ఒక్కరి కొరకు ప్రార్థన చేయబడుతుంది. మరియు రేపు, ప్రభువులో, మనము ఒక గొప్ప సమయమును కలిగియుంటామని ఆశిస్తున్నాము.

8 ఇప్పుడు ఇతర పట్టణాల నుండి సందర్శిస్తూ వచ్చిన, ప్రజలైన మీరు ఇక్కడ ఉన్నారు. గుర్తుంచుకోండి, ఇక్కడ, పట్టణమంతా చక్కని ఫుల్ గాస్పెల్ సంఘాలు ఉన్నాయి. వాటన్నిటికీ మీరు స్వాగతింపబడుతున్నారు.

9 నేను బయట ఉండగా, ఇప్పుడే వచ్చినట్టి నా సహచర కాపరులలో ఒకరైన బ్రదర్ జాక్సన్‌తో మాట్లాడుతున్నాను, ఆయన గతంలో మనకంటే ఒకటి లేదా రెండు పట్టణాల దిగువన ఉన్న మెథడిస్టు సంఘములో ఉండేవారు.

10 మరియు ఆలయానికి సంబంధించినవారు ఎంతమంది ఇక్కడ ఉన్నారు, మీ చేతులను చూద్దాం, అంతటా ఉన్నారు. మై, మిమ్మల్ని ఇక్కడ కలిగియున్నందుకు నేను నిశ్చయంగా——నిశ్చయంగా ఆనందిస్తున్నాను. చాలా కాలం తర్వాత ఇండియానాకు ఇంత సమీపంగా నేను కలిగియున్న కూటము ఇదేయైయున్నది. త్వరలో, నేను మళ్ళీ తిరిగి రావాలని ఆలోచిస్తున్నాను, మరియు ప్రభువు

చిత్తమైతే, ఒక డేరాను వేసి మరియు ఆ చివరి ఏడు బూరలను ప్రసంగించాలని అనుకుంటున్నాను.

11 కాబట్టి, ఇప్పుడు, అయితే రేపు గుర్తుంచుకోండి. రేపు రెండు గంటలకు, దానిని మర్చిపోకండి. మరియు, ఇప్పుడు, వచ్చే వారము, ఫ్లోరిడాలోని టాంపాలో, మా తదుపరి కూడికలు ప్రారంభమవుతాయి.

12 ఇప్పుడు నేను దీనిపై మాట్లాడగోరుతున్నాను: ఆత్మీయ మతి-... మతిమరుపు.

13 ఇప్పుడు, మనము మాట్లాడుకుంటున్న ఈ చిన్న వ్యక్తి, ఆమోసు గురించి, మనం పాశ్యభాగములోనికి వెళ్ళడానికి ముందు మన నేపథ్యాన్ని పొందుకోవడం కొరకు ఒక్క క్షణం చూద్దాము. ఇది సమరయ పట్టణం గొప్పగా అభివృద్ధి చెందుతున్న కాలములో జరిగిన విషయమైయున్నది. ఇశ్రాయేలు అభివృద్ధి చెందినది. వారు నిజంగా లోకాన్ని వెంబడిస్తూ వెళ్ళి బాగా అభివృద్ధి చెందారు.

14 అభివృద్ధి అనేది అన్నిసార్లు ఆత్మీయ ఆశీర్వాదాలకు సూచన కాదు, అయితే కొన్నిసార్లు అది దానికి విరుద్ధంగా ఉంటుంది. బహుశా మీరు అనేక లోకసంబంధమైన వస్తువులను సంపాదించుకోవాలని, అది దేవుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాడని చూపిస్తుందని ప్రజలు భావిస్తారు. అది సత్యము కాదు. కొన్నిసార్లు అది దానికి విరుద్ధంగా ఉంటుంది.

15 అయితే మనము అతణ్ణి, కనుగొంటాము, ఈ చిన్న వ్యక్తి గురించి మనకు అంతగా తెలియదు. అతడు, అతడు ఎక్కడి నుండి వచ్చాడన్నది తెలియజేసే ఎటువంటి చరిత్ర, మనకు లేదు. ఇక్కడున్న లేఖనము ప్రకారం, అతడు ఒక పశుల కాపరియని, మనకు తెలుసు, అయితే దేవుడు అతణ్ణి లేవనెత్తాడు.

16 ఆ రోజుల్లో ప్రపంచంలోని గొప్ప పర్యాటక నగరాలలో ఒకటిగా ఉన్న సమరయలో, బాగా ఎండ కాస్తున్న ఒక రోజున అక్కడి దృశ్యాన్ని నేను ఊహించగలుగుతున్నాను. అది మయామి, లేదా——లేదా లాస్ ఏంజిల్స్‌లోని, హాలీవుడ్ లాగా ఉంటుందని, మనము చెప్పవచ్చు, అలాంటి ప్రదేశాలలో ఒకటిగా ఉండి, పర్యాటకులకు ఎంతో ఆకర్షణీయమైన గొప్ప ప్రదేశంగా ఉంటుందని చెప్పవచ్చు. మరియు మనం అతణ్ణి చూడటాన్ని ఊహించుకోవచ్చు. అతడు ఇంతకు ముందెన్నడూ అటువంటి పట్టణములో ఉండలేదు. కానీ, అతని దగ్గర ప్రభువుయొక్క వాక్యము ఉన్నది, ప్రతీ వైపునా పాపము కుప్పగా పేరుకపోయిన ఈ గొప్ప పట్టణానికి అతడు వస్తున్నాడు. సేవకులందరూ దేవుని వాక్యము నుండి దూరంగా తొలగిపోయారు, మరియు చాలా సంవత్సరాలుగా వారికి ఒక ప్రవక్త కూడా లేడు.

17 కాబట్టి ఈ చిన్న వ్యక్తి, సమరయకు కొంచెం ఉత్తరాన్న ఉన్న, ఆ కొండ ఎక్కి వస్తుండగా, నేను అతణ్ణి ఇలా ఊహించగలుగుతున్నాను, సూర్యుని వేడి ప్రకాశిస్తుండగా, మరి అతని ముఖం మీద ఉన్న అతని తెల్లని గెడ్డంతో, మరియు తీక్షణంగా చూస్తున్న అతని చిన్న కళ్ళతో, మరియు మెరుస్తున్న, అతని చిన్న బట్టతలతో, అతడు ఆ పట్టణము వైపు చూస్తున్నాడు. మరియు అతని దృష్టి తీక్షణంగా మారినది. సాధారణంగా పర్యాటకులు చూసేవాటిని అతడు చూడటంలేదు, ఒక పట్టణానికి వెళ్ళి మరియు అక్కడి అందాల ఆకర్షణలను

చూసినట్లుగా అతడు చూడటంలేదు. ఆ పట్టణం ఏ విధమైన దుస్థితికి చేరుకుందో అతడు చూశాడు, ఒకప్పుడు దేవుని పట్టణముగా ఉన్న ఆ పట్టణం, మరి ఇప్పుడు అంతటి నైతిక పతనంలోకి ఎలా దిగజారిపోయిందో అతడు చూశాడు. ఎటువంటి ఆశ్చర్యము లేదు...

18 ఈ చిన్న, గుర్తుతెలియని వ్యక్తి ప్రవక్తయైన ఆమోసు అయ్యున్నాడు. మరియు ఇప్పుడు అతని గురించి మనకు అంతగా తెలియదు. అతడు ఎక్కడి నుండి వచ్చాడో మనకు తెలియదు. సాధారణంగా ప్రవక్తలు, తెలియని విధంగా రంగము మీదికి వస్తారు, తిరిగి ఆ విధంగానే వెళ్ళిపోతారు. వారు ఎక్కడనుండి వస్తారో, వారు ఎక్కడికి వెళ్తారో మనకు తెలియదు, వారి పుట్టుపూర్వోత్తరాలు మనకు తెలియదు. కేవలం దేవుడే వారిని లేపుతాడు. అతడు చూడటానికి అంత ఆకర్షణీయంగా ఏమీ లేడు, కాని అతడు **యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడును** కలిగియున్నాడు. నేను చూసిన ముఖ్యమైన విషయం అదేయైయున్నది. అవును, అతడు తన సువార్త సభలను ప్రారంభించడానికి సమరయకు వచ్చాడు. అతనికి ఎవరి దగ్గర నుండి కూడా ఎటువంటి సహకారము లభించలేదని నేను ఖచ్చితంగా చెప్పగలను. అతనికి ఏ సంఘశాఖ నుండి కూడా ఎటువంటి సహవాసపు కార్డు లేదు. అతడు ఏ గుంపు నుండి వచ్చాడో చూపించడానికి అతనికి ఎలాంటి ఆధార పత్రాలు లేవు. మరి, అయితే, అతడు ఒక్కటి కలిగియున్నాడు, అతడు ఆ పట్టణము కొరకు దేవునియొక్క వాక్యమును కలిగియున్నాడు.

19 మరియు నేను ఆశ్చర్యపోతున్నాను, మనము గనుక ఆమోసును, ఈనాడు, మన రోజుల్లోకి తీసుకురాగలిగితే, ఈ రోజున మన పట్టణములో అతనికి స్వాగతం లభించేదా అని నేను ఆశ్చర్యపోతున్నాను. మనం అతణ్ణి స్వీకరించేవారమా, లేదా మనం కూడా వారు చేసినట్లే చేసేవారమా అని నేను ఆశ్చర్యపోతున్నాను. మన పట్టణాలు కూడా అదే విధమైన పతనములో ఉండటాన్ని మనం కనుగొంటున్నాము. మరియు అప్పుడున్నట్లే, ప్రజల మధ్యలో పాపము ఎంతగానో విపరీతంగా పెరిగిపోవడాన్ని మనం కనుగొంటున్నాము. మరియు నేను ఆశ్చర్యపోతున్నాను, ఎవరికి తెలియని, ఈ దీనమైన వ్యక్తి, అసలు ఈ సువార్త సభలను ఎలా ప్రారంభించబోతున్నాడు? ఎలా, అతడు ఎక్కడి నుండి ప్రారంభించబోతున్నాడు? అతడు ఏ సంఘానికి వెళ్లనైయున్నాడు, లేదా అతనితో ఎవరు సహకరించబోతున్నారు? అతడు ఎక్కడి నుండి వచ్చాడో చూపించుకోడానికి అతని దగ్గర ఏమీ లేదు, ఆ పట్టణము కొరకు **యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు** ను తప్ప అతడు మరి దేనినీ కలిగిలేడు.

20 అతడు వారిని ఎంతగానో పతనమైపోయి మరియు నైతికంగా ఎంతో కుళ్ళిపోయిన స్థితిలో కనుగొన్నాడు, అది చాలా దారుణమైన కాలమైయున్నది. ఆ పట్టణములోని స్త్రీలు దాదాపు అమెరికాలో ఉన్నవారిలాగానే మారిపోయారు. వారు భ్రష్టులైపోయారు. దేవుడు వారినుండి ఆశించిన ప్రతిదాని వియములోను, వారు సరిగ్గా దానికి వ్యతిరేకంగా ప్రవర్తించారు. మరియు——మరియు అక్కడ వీధుల్లో నృత్యాలు జరిగే ఒక గొప్ప స్థలంగా అది ఉండేదని మనం కనుగొంటాము, స్త్రీలు అనైతికంగా తమ వస్త్రాలను విప్పుతూ, మరియు అటువంటివి చేస్తూ, స్ట్రిప్‌టీజ్ వంటి ప్రదర్శనలు చేసేవారు. అవును, అటువంటి ఆ రోజుల్లో బహిరంగ

వినోద కార్యక్రమాలుగా ఉండేవి, కానీ ఇప్పుడు అవి ప్రతీరోజు కనబడుతున్నాయి. వాతావరణం కాస్త వేడిగా మారితే చాలు, మరి మీరు ఏ ప్రదర్శనకూ వెళ్ళాల్సిన అవసరం లేదు. ఎలాగైనా, వారు వీధుల్లో, ఎక్కడ చూసినా కనిపిస్తున్నారు. అటువంటి పని చేయడానికి, స్త్రీలారా మీకు సిగ్గుచేటు! మీ గురించి మీకే సిగ్గుగా అనిపించడం లేదా?

21 మరియు పిదప—మరియు పిదప ఈ మధ్యనే, నేను దానిని ఇక్కడ ఒక స్త్రీతో చెప్పాను, మరియు ఆమె ఇట్లన్నది, "ఏంటి," ఆమె ఇట్లన్నది, "సహోదరుడా బ్రెన్హామ్," ఇంకా ఇట్లన్నది, "అది—అది ఆ మిగతా స్త్రీలందరూ చేసేదే కదా."

22 నేను ఇట్లు చెప్పాను, "కానీ మనము మిగతా ప్రజలవలె ప్రవర్తించవలసినవారము కాము. మనము భిన్నమైనవారము. మనము ఒక—ఒక భిన్నమైన గుణలక్షణము గలవారము."

23 అది నాకు ఒక స్త్రీని గుర్తుచేస్తుంది, ఇట్లన్నది, "సరే, బ్రెన్హామ్ సహోదరుడా," మరొక స్త్రీ ఇట్లన్నది, "నేను—నేను—నేను ఆ పాట్టి నిక్కర్లను వేసుకోను." ఇట్లన్నది, "నేను ప్యాంటులను వేసుకుంటాను."

24 నేను ఇట్లన్నాను, "అది ఇంకా దరిద్రం." అహ్! "'ఒక స్త్రీ పురుషుని వస్త్రములను ధరించుట,' ఆయన దృష్టిలో, 'హేయమైనదని,' దేవుడు చెప్పాడు." అది ఖచ్చితంగా నిజము.

ఒకరు ఇట్లన్నారు, "సరే, మరి వారు వేరే ఏ రకమైన వస్త్రాలను తయారు చేయడంలేదు."

"వారు ఇంకనూ కుట్టు మిషన్లను తయారు చేస్తున్నారు మరియు బట్టల సరుకులు కూడా అందుబాటులో ఉన్నాయి."

25 ఎటువంటి సాకు లేదు. హృదయములో ఉన్నదే లెక్కకి వస్తుంది. మరదే బయటకు వ్యక్తపరచబడుతుంది. అది—అది దానినదే గుర్తింపజేసుకుంటుంది.

26 మరియు ఇప్పుడు ఈ పట్టణములో, అది నైతికంగా పతనమైపోయిందని మనము కనుగొంటాము. దాని గురించి ఏదైనా చెప్పడానికి బోధకులు భయపడేవారు. మరియు, అయితే వారికి ఈ చిన్న, దీనమైన వ్యక్తి మాత్రం ఆ కొండ పైకి వస్తున్నాడు, **యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు**, "ఈ విషయాన్ని సరిచేసుకోండి, లేనట్లైతే మీరు చెరలోకి వెళ్ళబోతున్నారు," అని వారికి చెప్పడానికి వస్తున్నాడు. మరియు అతడు తన ప్రవచనం నెరవేరే దినములను చూచువరకు బ్రతికాడు. అతడు రెండవ యెరొబాము దినములలో ప్రవచించాడు, మరి ఎలాగైనా, యెరొబాము వెళ్ళగొట్టబడినవాడైయున్నాడు; అతడు—అతడు ఇతర దేశాలకు మద్దత్తుగా నిలిచాడు. మరియు—మరియు ఈ చిన్న ఆమోసు ప్రవచించి మరియు వారితో ఇట్లు చెప్పాడు, అతడు ఇట్లన్నాడు, "మీరు ఏ దేవుడినైతే సేవిస్తున్నారని చెప్పుకుంటున్నారో, సరిగ్గా ఆయనే మిమ్మల్ని నాశనము చేస్తాడు." మరి ఆయన చేశాడు.

27 మరియు ఇక్కడ, బర్మింగ్హామ్లో...ఈ రాత్రి ఇక్కడ అతని స్వరము ఉన్నట్లైతే, అది ఇక్కడి సంఘాలకు కూడా అదే విషయాన్ని చెప్పేది. "మీరు సేవించారని చెప్పుకుంటున్న అదే దేవుడు, ఒక దినమున మిమ్మల్ని నాశనము చేస్తాడు." నేను ఇక్కడున్న ఈ జనసమూహమును ఉద్దేశించి మాట్లాడటం

లేదు. ఈ టేపులు ప్రపంచమంతటికీ వెళ్తాయి. ఇప్పుడు, గుర్తుంచుకోండి, అది సత్యమైయున్నది.

28 పిదప అతడు, ఆ పట్టణములోనికి వచ్చినప్పుడు, అతడు...ఈ విషయాలన్నిటినీ కనుగొన్నాడు, అతడు ఎవరియొద్దకైతే పంపబడ్డాడో అట్టి దేవుని ప్రజలయొక్క పతనాన్ని చూసినప్పుడు, అతనికి ఏలా అనిపించియుంటుందో అని నేను ఆశ్చర్యపోతున్నాను.

29 ఇప్పుడు మనము అతణ్ణి స్వీకరిస్తామా అని నేను ఆశ్చర్యపోతున్నాను? అతడు లోపలికి వచ్చినట్లైతే, మనము——మనము అతనికి సహకరిస్తామా? మన శ్రేష్ఠమైన దానిని మనం అతనికి ఇస్తామా? మనం అతనిపట్ల శ్రద్ధ కలిగియుంటామా? మనం తిరిగి దేవునియొక్క వాక్యము నొద్దకు వెళ్ళాలని మరియు ప్రభువు మనల్ని చేయమని చెప్పిన విధంగా మనం చేయాలని అతడు మనకు చెప్పినట్లైతే మనం పశ్చాత్తాపపడతామా?

30 మన సహోదరీలు పాట్టిగా కత్తిరించుకున్న వారి జుట్టు విషయంలో ఏమి చేస్తారో అని నేను ఆశ్చర్యపోతున్నాను? ఆమోసు వచ్చినట్లైతే, వారు తమ జుట్టును మళ్లీ పెరగనిస్తారా? అతడు దానిని బోధిస్తాడు, మరియు నేను దానిని మీకు చెప్తున్నది, ఎందుకంటే అది ప్రభువుయొక్క వాక్యమైయున్నది.

31 మన——మన సంఘ బోర్డువారు నియమించే పెద్దలు మూడు లేదా నాలుగు సార్లు వివాహం చేసుకున్నవారై, మరియు——మరియు అటువంటి స్థితిలో ఉన్నవారైయుండి, పెద్దలుగా ఉండటానికి ప్రయత్నిస్తుంటే, మరి ఇలాంటి విషయాలన్నింటి గురించి అతడు ఏమి చేసేవాడో అని నేను—— నేను ఆశ్చర్యపడుతున్నాను, పురుషులు అటుగా వెళ్తుండగా తన భార్య పాట్టి నిక్కర్లు ధరించుకొని బయట వీధిలోకి వచ్చి, ఇంటి పెరట్లో, గడ్డి కోస్తూ ఉండటానికి అనుమతించే పురుషుడిని, అతడు ఏమి చేసియుండేవాడో అని నేను ఆశ్చర్యపడుతున్నాను? అటువంటి పురుషునితో అతడు ఏమి చెప్పేవాడో అని నేను ఆశ్చర్యపడుతున్నాను?

32 అతడు ఖచ్చితంగా అతనిలో ఉన్నదానంతటితో దానిని ఖండిస్తాడు, ఏలయనగా అతడు **యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు** ను కలిగియున్నాడు, మరియు అతడు దానిని తప్ప మరేమియు చేయలేడు. ఆ రోజుల్లో ఆత్మీయ మతిమరుపు, అనే ఒక తీవ్రమైన వ్యాధిని అతడు వారిలో కనుగొన్నాడు, మరియు ఈనాడు మనము సరిగ్గా దానినే కలిగియున్నాము.

33 ఇప్పుడు, ఏమి జరుగబోతుందో అతనికి ఎలా తెలుసు? ఆమోసుకి ఎలా తెలుసు? మొదటిగా, అతడు ఒక ప్రవక్తయైయున్నాడు. మరియు, తర్వాతి సంగతి ఏమిటంటే, ఆ వ్యాధిని బట్టి వ్యాధి నిర్ధారణ ఏమిటో అతనికి తెలుసు, మరియు దాని ఫలితాలు ఏమిటో కూడా అతనికి తెలుసు.

34 ఒక వైద్యుడు ఒక ప్రాణాంతకమైన కణితిని పరిశీలించి మరియు అది పూర్తిగా ముదిరిపోయిందని గమనించినప్పుడు, ఇక మరణము తప్ప మరేమియు మిగల్లేదు అని అతనికి తెలుస్తుంది. దేవుడు దాని విషయంలో ఏదైనా చేయకపోతే, ఇక అంతే.

35 సరి, మీరు ఒక పట్టణమును చూసినప్పుడు, మరియు మీరు ఒక జనమును చూసినప్పుడు, మీరు ఒక సంఘమును చూసి, మరియు దేవుడి నుండి ఎంతగానో దూరమైపోయిన ప్రజలను కనుగొన్నప్పుడు, దానికి కారణం ఏమిటని నిర్ధారించాలంటే, అది, "పాపము! తప్ప మరొకటి కాదు, 'మరియు పాపము వలన వచ్చు జీతము మరణమైయున్నది.' ఇక అది మరణించడమే." అదేమిటో వ్యాధి నిర్ధారణయే ఋజువు చేస్తుంది. మీరు చూడండి, ప్రజలు దేవుని నుండి దూరమైపోయి మరియు వాక్యమును వినకుండా ఉన్నప్పుడు, వాక్యము కొరకు ఇక ఎలాంటి కోరికను కలిగిలేకుండా ఉన్నప్పుడు, అప్పుడు దానికి ఒక్కటే వ్యాధి నిర్ధారణ ఉంది, "'పాపము చేయు ఆత్మ, మరణమునొందును.' అవిశ్వాసము మిమ్మల్ని దేవుని నుండి వేరుచేస్తుంది." అది ఖచ్చితంగా నిజము.

36 అది, అతడు పట్టణములో పాపము అనే——అనే వ్యాధిని చూసినప్పుడు, ఆ వ్యాధి ఏమిటో, దాని ఫలితాలు ఏమిటో అతడు ఎరిగియున్నాడు.

37 ఇప్పుడు, ఈ మతిమరుపు గురించి మనకు చెప్పబడింది ఏమిటంటే, అది ఒక——ఒక——ఒక...అది మీరు మిమ్మల్ని మీరు గుర్తించుకోలేని ఒక స్థితికి తీసుకువస్తుంది. ఇప్పుడు, అది ఒక అసాధారణమైన విషయమైయున్నది. ఇది తరచుగా సంభవించేది కాదు, అయితే షాక్ కి గురవ్వడంవలన ఇది సంభవిస్తుంది. ఇది ఎటువంటిదంటే ఒక వ్యక్తికి తాను ఎవరో కూడా తెలియదు. యుద్ధాల వలన ఇది సంభవించడాన్ని మీరు గమనిస్తారు, కొన్నిసార్లు, సైనికులకి ఇది కలుగుతుంది. కొన్నిసార్లు ప్రజలకి ఇది వస్తుంది. దీనికి కారణమయ్యే మరొక విషయం ఏమిటంటే, విచారము. విచారము వలన ఇది సంభవిస్తుంది.

38 విచారము వలన, అసలు ఎటువంటి ప్రయోజనం లేదు. అవును, కేవలం——కేవలం——కేవలం విచారమును విడిచిపెట్టి, విశ్వాసమును స్వీకరించండి.

39 ఒకరు ఇట్లన్నారు, "మంచిది, ఇప్పుడు, రేపు ఉదయం నీవు కాల్చి చంపబడబోతున్నట్లైతే, నువ్వు విచారించవా?"

నేను ఇట్లు చెప్పాను, "లేదు, విచారించను."

"ఎందుకు?"

నేను ఇట్లన్నాను, "విచారము నన్ను మరింత కృంగజేయడం తప్ప మరేమియు చేయదు."

"మంచిది, మరి విశ్వాసమును కలిగియుండటం వలన ప్రయోజనం ఏమిటి?"

నేను ఇట్లన్నాను, "అది నన్ను విడిపించవచ్చు." మరియు అది నిజము, చూడండి.

40 కాబట్టి విచారించడం వలన, అసలు ఏమాత్రము ప్రయోజనం లేదు, కానీ విశ్వాసము వలన ప్రయోజనం ఉంది. నమ్మండి!

ఇప్పుడు కొన్నిసార్లు విచారమే దానికి కారణమౌతుంది.

41 మరియు ప్రజల మధ్య ఇది సంభవించడానికి మరొక కారణం ఏమిటంటే, రెండు అభిప్రాయాల మధ్య తడబడటం వలనైయున్నది. మరది మతిమరుపును కలుగజేస్తుంది. మరియు అది మిమల్ని——మిమ్మల్ని ఎటువంటి స్థితికి తీసుకువస్తుందంటే, వాస్తవానికి, మీరు చేసినదానిని, మీ ఆలోచన శక్తిని మీరు

కోల్పోతారు. మీరు మీ మతిని కోల్పోతారు. మీరు అసలు...మీరు ఎవరో కూడా మీకు తెలియదు. మిమ్మల్ని మీరు గుర్తుపట్టుకోలేరు. మీరు చుట్టూ నడవగలరు, తినగలరు మరియు ప్రతీది చేయగలరు, కానీ, మీరు, ఇంకను మిమ్మల్ని మీరు గుర్తుపట్టుకోలేరు. మీరు మీ పండిత్యముతో కూడిన విద్యను కలిగియున్నారు, మీరు...మీరు ఇదివరకు కలిగియున్న అదే విద్యను కలిగియుండవచ్చును, కానీ అది ఎక్కడి నుండి వచ్చినదో మీకు తెలియదు, మీరెవరన్నది, మీరు ఎక్కడికి చెందినవారన్నది మీకు తెలియదు. మనకు చెప్పబడిన ప్రకారం, మరదే మతిమరుపైయున్నది.

42 ఈ మానవ జీవితంలో, మనము వివాహము ద్వారా, మనం మన కుటుంబాలతో గుర్తించబడినాము. మరియు మన భార్యలను, మనం వివాహము చేసుకొని, మరియు మన——మన——మన వివాహముయొక్క బంధం ద్వారా మన కుటుంబము గుర్తించబడుతుంది. మరియు పిదప, ఆలోచిస్తే, ఈ భయంకరమైన సంగతే మీకు జరిగి మరియు మీరు ఎవరిని వివాహము చేసుకున్నారో, మీ భార్య ఎవరో, మీ పిల్లలు ఎవరో, మీ తల్లిదండ్రులు ఎవరో, మీ పొరుగువాడు ఎవరో కూడా మీరు గుర్తుపట్టలేకపోతే ఎలా ఉంటుంది? అది ఒక——ఒక భయంకరమైన విషయంగా ఉంటుంది.

43 పిదప మనము గుర్తించబడతాము, మరలా, మనకున్న మేధస్సును బట్టి, మరియు——మరియు జంతు జీవము కంటే భిన్నంగా ఉండటాన్ని బట్టి, మనల్ని మనం మానవ జాతిలో గుర్తించుకోగలుగుతాము. జంతువు ఆలోచించలేదు, అది కేవలం శబ్దాలను బట్టి నడుచుకుంటుంది. దానికి అంతరాత్మలేదు. మరియు, అయితే, మనం కూడా జంతు జీవమైయున్నాము. మనల్ని భిన్నంగా చేసేది ఏమిటంటే...మనం క్షీరదాలమై యునాము, కానీ...ఆ క్షీరదం ఉడుకు-రక్తమును కలిగిన జంతువైయున్నది, మరియు మనము జంతువుయొక్క ఆకారములో ఉన్నాము. అయితే మనల్ని భిన్నంగా చేసేది ఏమిటంటే, మనం ఒక అంతరాత్మను కలిగియుండటాన్ని బట్టి, ఏది ఒప్పో మరియు ఏది తప్పో మనకు తెలియజేసే ఒక మనస్సాక్షిని కలిగియుండటాన్ని బట్టి మనం గుర్తించబడతాము.

44 ఇప్పుడు ఇలాంటి పరిస్థితి కూడా ఉంటుంది, ఈ మతిమరుపు గనుక మీకు వస్తే, నెబుకద్నెజరుకు జరిగినట్లే మీకు జరగవచ్చు, అది, ఒకసారి అతడు తననుతాను హెచ్చించుకున్నాడు, అప్పుడు దేవుడు అతణ్ణి తాను ఒక జంతువని అనుకునేలాగా చేశాడు. మరియు అతడు అరణ్యములో నివసిస్తూ మరియు——మరియు ఒక ఎద్దువలె గడ్డి తిన్నాడు. మరియు——మరియు అతని——అతని శరీరమంతా పక్షిరాజు ఈకలవలే, వెంట్రుకలు పెరిగాయి, మరియు అతడు తనలో పశువు మనస్సు గలవాడయ్యాడు. చూశారా? అది మతిమరుపై యున్నది, ఎందుకంటే తాను ఒక రాజు అనే విషయాన్ని అతడు మరచిపోయాడు. తాను ఒక మానవుడు అనే విషయాన్ని అతడు మరచిపోయాడు. మరియు తాను ఒక జంతువు అని అతడు అనుకున్నాడు, కాబట్టే అతడు ఒక జంతువులాగా ప్రవర్తించాడు, ఎందుకంటే తాను ఒక మానవుడన్న సంగతిని అతడు మరచిపోయాడు.

45 ఈనాడు, అది చాలా సులభంగా మారినది. మరియు కొన్నిసార్లు, క్రైస్తవ సంఘము అంటే ఏమిటో, మనం మర్చిపోతుంటాము. మనం లోకము వలె

ప్రవర్తిస్తుంటాము. మీరు ఒక క్రైస్తవునివలె ప్రవర్తించడం లేదు గనుక, మరదే మనకు ఆత్మీయ మతిమరుపు ఉన్నదని చూపిస్తున్నది. మీరు లోకమువలే ప్రవర్తిస్తుంటారు. మీరు లోకపు మనస్సును స్వీకరించారు, మరి అదే దీనికి కారణమవుతుంది.

46 ఇక్కడ ఇశ్రాయేలు బహిర్గతం చేసుకొని, లోకమునకు బహిర్గతం చేసుకొని, మరియు ఈ గోతిలో పడిపోయిందని మనం——మనం కనుగొంటాము. మరియు తనకు సాధ్యమైతే దానినుండి వారిని బయటకు తీయడానికి, మరియు వారికి చెప్పడానికి, ఈ ప్రవక్త పంపబడ్డాడు. దేవుడు, తన కృపచేత, భూమి మీదనున్న మిగతా కుటుంబాలన్నిటిలో నుండి ఇశ్రాయేలును ఎన్నుకున్నాడు. కృపయే దానిని చేసినది. ఆయన వారికి అత్యుత్తమమైన భూములను ఇచ్చాడు. వారు ఎన్నడూ నిర్మించాల్సిన పని లేకుండా ఆయన వారికి ఇళ్లను ఇచ్చాడు. దేవుడే దానిని చేశాడు, వారిని ఎన్నుకున్నాడు. వారు ఎన్నడూ కొనని పాలాలను ఆయన వారికి ఇచ్చాడు. ఆయన——ఆయన వారికి ఇచ్చాడు, వారెన్నడూ నాటని ఆహారాన్ని ఆయన వారికిచ్చాడు. వారు ఎన్నడూ త్రవ్వనటువంటి బావులను ఆయన వారికిచ్చాడు. వారు ఎన్నడూ గెలవనటువంటి విజయాలను ఆయన వారికిచ్చాడు. అర్హతకు మించిన కృపను ఆయన వారికిచ్చాడు. దేవుడు తన కృప ద్వారా ఈ ప్రజల కొరకు, ఆయన ఎన్నుకున్న, ఆయనయొక్క ప్రియమైన, ఇశ్రాయేలు కొరకు దానిని చేశాడు.

47 మరియు ఆయన బైబిలులో, ఇట్లు చెప్పాడు, "ఆయన ఆమెను పాలములో, ఆమెయొక్క స్వంత రక్తంలో పడియున్న ఒక చిన్న బాలికగా కనుగొన్నాడు, మరియు ఆయన ఆమెను కడిగి మరియు ఆమెను శుభ్రపరచి, మరియు ఇవన్నీ చేశాడు. అయితే దేవుడు ఇట్టి కనికరమును ఆమెకు చూపించిన తరువాత, మరి ఆమె ధనవంతురాలైనది," ఆమెకు మతిమరుపు వచ్చినది, మతిమరుపు, "మరియు ఈ సంగతులన్నీ ఎక్కడి నుండి వచ్చాయన్నది ఆమె మర్చిపోయినది."

48 అది 1964లోని U.S.A., యొక్క దృశ్యమని నేను అనుకుంటున్నాను. అది అదే విధమైన జబ్బుతో బాధపడుతున్నది. మనం గొప్ప శక్తివంతమైన సంఘాలుగా ఉన్నాము. మనము ఒక గొప్ప, శక్తివంతమైన ప్రజలముగా ఉన్నాము. మనం లక్షలకొలది సంఖ్యలో ఉన్నాము, కానీ ఇవన్నీ ఎక్కడి నుండి వచ్చాయో మనం మర్చిపోయాము.

49 వారు దానిని చాలా తీవ్రమైన స్థాయిలో కలిగియున్నారు. దేవుడు వారిపట్ల ఎంతో మేలుకరంగా ఉండి, మరియు అన్యజనుల దేశములన్నిటి నుండి వారిని బయటికి తీసుకువచ్చాడు, మరియు వారిని ఒక ప్రత్యేకమైన ప్రజలుగా చేశాడు, తన కొరకు ప్రత్యేకపరచుకున్నాడు. ఆయన ఇట్లు చెప్పాడు, "ఆయన ఒక దేశము నుండి ద్రాక్షావల్లిని తీసి మరియు మరొక దేశములో దానిని నాటాడు, మరియు అది బాగుగా ఎదిగి ఫలములను ఫలించి మరియు ఫలభరితంగా ఉండునట్లు దాని చుట్టూ కంచెను వేశాడు, కానీ ఆ ద్రాక్షతీగ దానికి ఆశీర్వాదములు ఎక్కడి నుండి వచ్చాయో మర్చిపోయినది."

50 ఆ విధంగానే దేవుని ప్రజలు, ఈ అంత్య దినాల్లో, ఒక క్రైస్తవుడిగా ఉండటం అంటే ఏమిటన్న సాక్ష్యాన్ని మరచిపోయారు. అది మరలా, ఈ మతిమరుపు ప్రజలపైకి వచ్చేసినది. వారు తమనుతాము గుర్తించుకోలేకపోతున్నారు.

51 వారు, వారు దాని గురించి అంతా మర్చిపోయారు. వారు ఆయనయొక్క పరిశుద్ధతను మర్చిపోయారు. వారు ఆయనయొక్క నియమమును మర్చిపోయారు. స్త్రీలు మిగతా స్త్రీల వలె జీవిస్తున్నారు.

52 దేవుని సంఘము మరియు ఆయనయొక్క ప్రజలు ఎల్లప్పుడూ, "ఒక వేరుచేయబడిన జనముగా, ఒక——ఒక బయటకు పిలువబడిన జనముగా, ఒక ప్రత్యేకమైన జనముగా, ఒక పరిశుద్ధమైన దేశముగా, ఒక రాజవంశపు యాజకత్వముగా; దేవునికి ఆత్మసంబంధమైన బలులను అర్పిస్తూ, వారి జిహ్వాఫలములను అర్పిస్తూ, ఆయన నామమునకు స్తుతులు చెల్లించేవారిగా ఉన్నారు." సరిగ్గా ఆ కారణము కొరకే, దేవుడు తన సంఘమును పిలిచాడు మరియు లోకమునుండి దానిని వేరుచేశాడు. మరియు ఆయన దానికి ఒక ధర్మశాస్త్రమును ఇచ్చాడు, మరియు ఆయన, అది, పరిశుద్ధముగా ఉండవలసియున్నది. ఆయన ఇట్లు చెప్పాడు, "నేను పరిశుద్ధుడను, మరియు మీరును పరిశుద్ధులైయ్యుండాలి, మరియు పరిశుద్ధత లేకుండా ఏ నరుడు ప్రభువును చూడలేడు." స్వయంగా దేవుడే, దానిని చెప్పాడు.

53 మరియు ఆయన ఈ ప్రజలను ఈ రకమైన ప్రజలుగా ఉండటానికి పిలిచాడు, కానీ వారు దాని గురించి మర్చిపోయారు. వారు ఆయనయొక్క ఆజ్ఞలను మర్చిపోయారు, మరియు వారు తమ నైతిక విలువలను మర్చిపోయారు. వీధిలో ఉన్న స్త్రీలు, బయట అక్కడ ఇశ్రాయేలు స్త్రీలు, ప్రతియొక్కరు పరిశుద్ధాత్మతో గర్భము ధరించాలని ఎదురుచూస్తున్నారు, మెస్సీయాను కనాలని ఎదురుచూస్తున్నారు, మరియు పిదప ఆ విధంగా ప్రవర్తిస్తున్నారు. వారి గుణలక్షణము చాలా ఘోరంగా ఉన్నది.

54 ఈ రోజు క్రైస్తవులని పిలుచుకునే మన ప్రజల మధ్య కూడా, అది అదే విధంగా ఉన్నదని చెప్పడానికి, ఒక్క నిమిషం నేను ఇక్కడ ఆగాలని కోరుతున్నాను. వారి గుణలక్షణము, మీరు కేవలం గుర్తిస్తే చాలు!

55 ఒకసారి, దక్షిణాన ఇట్లు జరిగినది. దిగువున ఇక్కడ జరిగిన ఒక కథను నేను చదివాను, అది వారు బానిసలను కలిగియుండే సమయములో జరిగినది. వారు ఆ ప్రజలను తీసుకొని మరియు మీరు ఒక వాడిన కారును అమ్మివేసినట్లే, వారిని అమ్మేవారు. మరియు పిదప ఒక కొనుగోలుదారుడు ఉంటాడు, మధ్యవర్తి వచ్చి మరియు ఈ బానిసలను తీసుకొని మరియు వారిని వర్తకము చేసేవాడు, మరి సరిగ్గా మీరు ఒక కారును లేదా మరిదేనినో వర్తకము చేసినట్లే వారు దానిని చేసేవారు.

56 మరియు ఆ బానిసలు వారు స్వదేశమునకు దూరంగా ఉండాల్సివచ్చేది. వారు ఆఫ్రికాకు చెందినవారైయున్నారు. ఆ బోయర్లు అనబడేవారు వారిని కిడ్నాప్ చేసి, వారిని ఇక్కడ దీవులకు తీసుకువస్తారు, జమైకా మరియు దాని చుట్టుపక్కల ప్రాంతాల నుండి వారిని తీసుకొచ్చి, మరియు పిదప వారిని అక్రమంగా అమెరికాకు తరలించి బానిసలుగా అమ్మేశారు.

57 ఇప్పుడు ఆ ప్రజలు విచారంగా ఉండటాన్ని మనం కనుగొంటాము. వారు తమ స్వంత దేశము నుండి బలవంతముగా తీసుకుపోబడ్డారు. వారు శత్రువు ద్వారా బయటికి తీసుకుపోబడ్డారు, అందువలన వారు విచారంగా ఉన్నారు. వారు ఇక

ఎన్నటికీ తమ భర్తలను ఎంతమాత్రమూ చూడలేరు, లేదా తమ భార్యలను, తమ తల్లిదండ్రులను, తమ పిల్లలను ఎంతమాత్రము చూడలేరు. వారు ఖచ్చితంగా... వారు దుఃఖముతో ఉన్న ప్రజలు గనుక, వారితో పనిచేపించడానికి, వారు వారిని కొరడాలతో, కొట్టాల్సివచ్చేది.

58 మరియు ఒక దినమున, ఒక బానిసల వ్యాపారి ఒక నిర్దిష్టమైన వ్యవసాయ క్షేత్రం ప్రక్కగా వెళ్తుండగా, అక్కడ కొంతమంది బానిసలు పనిచేస్తుండటాన్ని అతడు చూశాడు. మరియు—అతడు అతడు లోపలికి వెళ్ళి మరియు ఆ యజమానుడిని అడిగాడు, ఇట్లన్నాడు, "నీవద్ద ఎంతమంది బానిసలు ఉన్నారు?"

అతడు ఇట్లు చెప్పాడు, "దాదాపు ఒక వందమంది."

ఇట్లన్నాడు, "మారకానికైనా లేదా అమ్మకానికైనా నీవు ఎవరినైనా కలిగియున్నావా?"

"అవును," అని అతడన్నాడు.

"వారిని చూడనిమ్ము," అని అతడు అన్నాడు.

59 మరియు అతడు ఆ పొలములోకి వెళ్ళి వారిని గమనించాడు, మరియు వారిని చుట్టూ కొరడాలతో కొట్టాల్సివస్తున్నట్లు చూశాడు. మరియు కొంతసేపైన తరువాత, వారు కొరడాలతో కొట్టాల్సిన అవసరం లేని ఒక యౌవనస్థుణ్ణి అతడు చూశాడు. అతడు తన ఛాతిని విరుచుకొని మరియు తన గడ్డమును పైకెత్తుకొని ఉన్నాడు; అతణ్ణి కొరడాతో కొట్టాల్సిన అవసరం లేదు. కాబట్టి ఆ బేరగాడు ఇట్లన్నాడు, "నేను ఆ బానిసను కొనుక్కోవాలనుకుంటున్నాను."

మరియు అతడు ఇట్లు చెప్పాడు, "అయితే అతడు అమ్మకానికి కాదు."

60 అతడు ఇట్లన్నాడు, "మంచిది, ఆ బానిస యొక్క ప్రత్యేకత ఏమిటి?" ఇట్లన్నాడు, "ఆ మిగతావారి మీద ఆ బానిస యజమానా?"

అతడు ఇట్లన్నాడు, "కాదు, అతడు కూడా ఒక బానిసే."

అందుకతడు ఇట్లన్నాడు, "మంచిది, బహుశా మీరు అతనికి ప్రత్యేకమైన ఆహారము పెడతారేమో."

అతడు ఇట్లు చెప్పాడు, "లేదు, అతడు కూడా ఆ మిగతా బానిసలతోపాటు ఆ వంటశాలలోనే భోజనం చేస్తాడు."

61 అందుకతడు, "సరే, ఆ మిగతా బానిసల నుండి అతణ్ణి అంత భిన్నంగా చేసేది ఏమిటి?"

62 అతడు ఇట్లన్నాడు, "మంచిది, నేను కూడా, చాలా కాలంగా, ఈ విషయాన్ని గురించే ఆశ్చర్యపోయాను. కానీ ఒక రోజు నేను తెలుసుకున్నది ఏమిటంటే, అది, అతడు ఎక్కడినుండైతే వచ్చాడో అట్టి తన స్వదేశంలో, అతని తండ్రి ఆ తెగ మొత్తానికి రాజైయున్నాడు. మరి అతడు ఒక పరదేశిగా ఉండి, ఇంటినుండి దూరముగా ఉన్నప్పటికినీ, అతడు ఒక రాజకుమారుడైయున్నాడని అతడు ఎరిగియున్నాడు, మరియు ఒక రాజకుమారుడి లాగానే అతడు—అతడు నడుచుకుంటాడు."

63 నేను ఇట్లనుకున్నాను, “కానీ, అది, ఆఫ్రికా నుండి వచ్చిన ఒక నిగ్రోవాడు, మరి అతని తండ్రి ఒక తెగకు చెందినవాడని మరియు ఒక తెగకు రాజు అని ఎరిగియుండి ఆ విధంగా జీవిస్తే, మహిమలో మన తండ్రి పరలోకపు రాజుయైయున్నాడని ఎరిగియున్న, ఒక తిరిగి జన్మించిన క్రైస్తవునికి, పురుషునికైనా లేదా ఒక స్త్రీకైనా అది ఏమి చేయవలసియున్నది కదా!” మనము క్రైస్తవ పురుషులుగా మరియు స్త్రీలుగా ప్రవర్తించవలసియున్నాము. మనము ఆ విధంగా ప్రవర్తించవలసియున్నాము, ఆ విధంగా వస్త్రధారణ చేసుకోవలసియున్నాము, ఆ విధంగా మాట్లాడవలసియున్నాము, ఆ విధంగా జీవించవలసియున్నాము. మనము పరదేశులమైనా గాని, మనము రాజుయొక్క పిల్లలమైయున్నాము. ఆమేన్.

64 మనము జీవిస్తున్న ఈ దినములలో మన గుణలక్షణము, మన అనైతికతను చూడండి! ఇశ్రాయేలు కూడా అదే గోతిలో పడిపోయినది మరియు ఎంతో అనైతికముగా మారినది. “నీవు వ్యభిచరించకూడదు, నీవు నీ పొరుగువాని భార్యను మోహించకూడదు,” మరియు మొదలగు దేవుని ఆజ్ఞలను వారు మర్చిపోయారు. వారు ఆ ఆజ్ఞలను మర్చిపోయారు. వారు——వారు——వారు దానిని ఇక ఎంతమాత్రము కలిగియుండగోరలేదు. మరియు వారు——వారు——మిగతా ప్రపంచమువలె ఉండగోరినారు, సరిగ్గా ఈనాడు సంఘమువలె ఉన్నది.

65 ఒకసారి, ఇశ్రాయేలీయులు, వారు ప్రారంభమైనప్పుడు, వారు తమపై రాజును కలిగియుండగోరినారు. వారి కొరకు పంపబడిన ప్రవక్తయైనట్టి సమూయేలు వారికి చెప్పాడు, అతడు ఇట్లన్నాడు, “ఇప్పుడు ప్రభువు నామములో నేను మీకు చెప్పినది ఏదైనా జరుగకుండా ఉన్నదా?”

వారు ఇట్లన్నారు, “లేదు, ఆ విధంగా ఎన్నడూ లేదు.”

66 “నేను నా జీవనం కోసం, నా ఆహారము కొరకు మరియు డబ్బు కొరకు, మీ డబ్బు కొరకు, నేను ఎన్నడైనా మిమ్మల్ని అడుక్కున్నానా?”

67 “లేదు, నీవు ఆ విధంగా చేయలేదు. సమూయేలు, నీవు చెప్పినవాటిలో ఒక్కటి కూడా నెరవేరకుండా పోలేదు. మరియు నీవు నీ బ్రతుకుతెరువు కోసం, మా డబ్బు కొరకు ఎన్నడూ అడుగలేదు. కానీ, అయినను, ఎలాగైనా, మాకు రాజు కావాలి.”

68 దేవుడు సమూయేలుతో ఇట్లన్నాడు, “వారు అతణ్ణి పొందుకోనిమ్ము. వారు నిన్ను తిరస్కరించలేదు; వారు నన్నే తిరస్కరించారు.”

69 ఇశ్రాయేలు ఇప్పుడు అదే స్థితికి చేరుకున్నది. వారు దేవుని ప్రవక్తలను ఇక ఎంతమాత్రమూ కోరుకోలేదు. వారి అవసరత వారికి ఇక వద్దనుకున్నారు. మరియు ఒకరు వచ్చి, మరియు వారికి వాక్యమును తెచ్చి, మరియు వారిని తిరిగి వాక్యమునొద్దకు తెచ్చుటకు ప్రయత్నిస్తే, వారు దానిని తృణీకరించేవారు. వారెల్లప్పుడు ఆ విధంగా చేసేవారు, ఆ విధమైన కుళ్ళులో ఉన్నారు.

70 లోకము మరియు సంఘము కలిసిపోయినప్పుడు, అప్పుడు వారు ఆత్మసంబంధమైన దేనిని కోరరు. వారు **యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు** ను కోరలేదు. వారికి నచ్చిందే వారికి కావాలి. వారికి లోకము కావాలి, మరియు వారు ఒక క్రైస్తవుడని చెప్పుకొనగోరుతారు; మరియు లోకములో జీవిస్తారు, మరియు లోకముతో జీవిస్తారు, మరియు లోకమువలె జీవిస్తారు,

మరియు ఇంకను క్రైస్తవులమనే తమ ఒప్పుకోలును కొనసాగిస్తుంటారు. మీకు తెలుసా, దానికి కారణము, అది ఆత్మీయ మతిమరుపైయున్నది. అది ఖచ్చితంగా అదేయైయున్నది. వారు ఎవరో వారికే తెలియదు. వారు ఏమి చేయవలసియున్నారో వారు మర్చిపోయారు.

71 అటువంటి ఒకరు, ఈ రోజు వస్తే, అది సరిగ్గా అదే విధంగా తృణీకరించబడుతుంది. వారికి ఆ ఆత్మీయ మతిమరుపు చాలా తీవ్రంగా ఉన్నది, మరియు ఈనాడు కూడా అది వారికి తీవ్రంగానే ఉన్నది. వారు ఇక ఎంతమాత్రమూ, సహజాతీతమైన కార్యములతో తమనుతాము గుర్తించుకోలేకపోతున్నారు, ఎందుకంటే వారు దానిని కోరలేదు. వాక్యము, సువార్త, వారికి అది అక్కర్లేదు. పాప రోగము వారిని పీడించింది, మరి వారు దానినే ఇష్టపడ్డారు.

72 మారుమనస్సులేని హృదయానికి పాపము ఆహ్లాదముగా ఉంటుంది. మారుమనస్సు పొందని మనస్సుకి అది బాగుగా ఉంటుంది, కానీ అది మరణ మార్గమైయున్నది. మరణము తప్ప మరేమీ మిగిలిలేదు. "పాపమువలన వచ్చు జీతము మరణము," మరియు మీరు ఆ జీతమును కోయవలసిందే. మీరు గాలులను విత్తారు, మరియు ఇప్పుడు సుడిగాలులను కోస్తున్నారు.

73 ఆత్మసంబంధమైన సూచనలు మరియు దేవునినుండి వచ్చినట్టి ఒక అభిషేకించబడిన వర్తమానికుడి బోధన, వారిని ఇక ఎంతమాత్రము కదిలించలేదు. ఆ స్త్రీలు వారి ముఖము ఎదుటనే నవ్వుతారు, మరియు "నేను వెళ్ళి అటువంటి విషయాలను వినాల్సిన అవసరంలేదు," అని అంటారు. అది మరలా జరుగలేదా! అది ఏమిటి? ఆత్మీయ మతిమరుపు, అది ఖచ్చితంగా అదేయైయున్నది. దేవుడు మరియు ఆయనయొక్క వాక్యము ఒక్కటేనని, మరియు ఆయన దానిని మార్చలేడని వారు మర్చిపోయారు.

74 ఆ దినములలో ఒక ప్రవక్త రంగం మీద లేచి మరియు ఒక ఆత్మసంబంధమైన సూచనను, ఒక ఆత్మసంబంధమైన స్వరమును, మరియు దాని వెనుక దేవుని స్వరమును ఇచ్చినట్లైతే, వారు కేవలం దానిని చూసి నవ్వి మరియు దానిని ఎగతాళి చేసేవారు.

75 మీకు ఈ పాత సామెత తెలుసు, "దేవదూతలు అడుగుపెట్టడానికే భయపడే చోట భుద్ధిహీనులు బూట్లు వేసుకొని ఎగురుతున్నారు." ఈ ఆత్మీయ మతిమరుపు దానినే కలుగజేస్తుంది. అది ప్రజలను ఎటువంటి ఒక స్థితికి తీసుకువస్తుందంటే వారు వారిలోపల అసలు ఎటువంటి అనుభూతిని కలిగియుండరు. ఆత్మసంబంధమైనది ఏదీ వారికి వద్దు.

76 ఎక్కడైతే పరిశుద్ధాత్మ రోగులను స్వస్థపరుస్తూ, మరియు హృదయములోని తలంపులను వివేచిస్తున్నాడో అటువంటి ఒక ఆత్మసంబంధమైన కూడికను తీసుకొని, మరియు దానిని సంఘములన్నిటి మధ్య జరుగనిచ్చి, ఈ స్టేడియంలో ఒక పెద్ద సమావేశమును నిర్వహించి, మరియు ఏమి జరుగుతుందో చూడండి. కొన్ని నిమిషములలోనే, ప్రతీ ఒక్కరు లేచి బయటకు వెళ్తూ ఉంటారు. దానితో వారికి ఎటువంటి సంబంధమూ లేదు. వారు దానితో ఎటువంటి సంబంధమును కలిగియుండాలని కోరరు. వారు ఏదో ఒక మేధస్సంబంధమైన బోధను వింటారు.

77 కానీ యేసుక్రీస్తు శక్తి, మరియు ఆయనయొక్క పునరుద్ధరణ, మరియు పరిశుద్ధాత్మ విషయానికి వస్తే, వారు దానితో ఎటువంటి సంబంధమును కలిగియుండాలని కోరుకోరు, ఎందుకంటే అది వారిని ఖండిస్తుంది. వారు ఎరుగవలసిన సంగతితో అది వారిని మండిస్తుంది. అవును, ఎటువంటి శిక్షావిధి లేకపోవడమనేది, కొంతకాలము వరకు ఆహ్లాదకరంగానే ఉంటుంది. కానీ, మీరు దానిమీదే ఆనుకొనియుంటే, అది——అది పశ్చాత్తాపముకు తగిన ఫలములను ఫలింపజేస్తుంది. కాబట్టి మనము ఇట్లు కనుగొంటాము, ఈ ఆత్మీయ మతిమరుపు ప్రజలను పట్టుకున్నప్పుడు, అప్పుడు వారు——వారు ఒక దయనీయమైన స్థితిలో ఉన్నారు. ఇప్పుడు కూడా మనము దానినే కనుగొంటున్నాము. ఇప్పుడు నేను ఏమి కోరుతున్నానంటే---

78 మీరు గుర్తించబడవలసి యున్నది. ఎక్కడో ఒక దగ్గర, మీరు కనబరచబడాలి. మీరు ఎక్కడ గుర్తించబడ్డారనేది, ఈ రాత్రి, మీ జీవితమే చూపిస్తుంది. మీరు క్రీస్తులోనైనా లేదా క్రీస్తునకు వెలుపలైనా గుర్తించబడతారు. మీరు మధ్యలో ఉండరు. ఒక మద్యం మత్తులో ఉండి స్పష్టబుద్ధి గలవాడు ఎవ్వడూ లేడు. నల్లని తెల్లని పక్షి అనేదేది లేదు. మీరు రక్షించబడ్డారు లేదా రక్షించబడలేదు. మీరు ఒక పరిశుద్ధుడైయున్నాడు లేదా ఒక పాపియైయున్నారు, ఏదో ఒకటియై యున్నారు, మరియు దేవుని వాక్యము పట్ల మీ ఆత్మసంబంధమైన వైఖరియే మీరు ఎక్కడ నిలబడియున్నారు అనేదానిని గుర్తిపజేస్తుంది. నిజము!

79 పరిశుద్ధాత్మ బాప్తిస్మము సరిగ్గా పెంతెకొస్తు దినమున ఉన్నట్లుగానే లేదా మరే ఇతర కాలములో ఉన్నట్లుగానే, ఇప్పుడును అదే విధంగా ఉన్నదని దేవునియొక్క వాక్యము నిర్ధారించి, ఋజువుచేసినది. మరియు యేసుక్రీస్తు నిన్నా, నేడు, మరియు నిరంతరము ఒక్కటేరీతిగా ఉన్నాడు. మరియు దానిపట్ల మీకున్న వైఖరియే మీకు ఆత్మీయ మతిమరుపు ఉందా లేదా అనేదానిని గుర్తింపజేస్తుంది. అది నిజము. మీరు ఒక పరిచారకుడైనా, లేదా మీరు ఒక బోధకుడైనా, అది ఎటువంటి వ్యత్యాసమును కలిగించదు---అవును, అది వారికి కూడా, సోకుతుంది. కాబట్టి మనము ఇట్లు కనుగొంటాము, అది అంటువ్యాధియైయుండి అంతటికీ వ్యాపిస్తుంది. ఇప్పుడు మనము ఇట్లు కనుగొంటాము.

80 ఇప్పుడు, ఒక అమెరికావాడైయుండుట. అమెరికావాడైయుండటానికి, నేను నా దేశముతో గుర్తించబడవలసియున్నది. ఇప్పుడు జాగ్రత్తగా వినండి. ఒక అమెరికావాడైయుండటానికి, నేను ఇక్కడ ఈ దేశములో జన్మించినప్పుడు, నేను ఒక పౌరుడనయ్యాను, మరియు నేను ఈ దేశముతో గుర్తించబడ్డాను. అదేమైయున్నదో, అదంతా నేను అయ్యున్నాను. అది గతంలో ఏమైయున్నదో, అదంతా నేను అయ్యున్నాను. ఒక అమెరికావాడిగా నేను గుర్తించబడ్డాను గనుక, అప్పుడు నేను దానియొక్క సమస్త అవమానమును, సమస్త మహిమను తీసికోవలసియున్నది. అది ఏమైయున్నదో, నేను అదేయైయున్నాను, ఎందుకంటే నేను దానితో గుర్తించబడ్డాను. ఆమేన్. మీరు దానిని గ్రహించాలని నేను కోరుతున్నాను. నేను ఒక అమెరికా పౌరునిగా గుర్తించబడ్డాను, అప్పుడు అది ఇదివరకు అయ్యున్నదంతా, నేను అయ్యున్నాను. అది ఇప్పుడు ఏమైయున్నదో, నేను అదేయైయున్నాను. నేను తప్పక దానిలో భాగమైయుండవలసియున్నాను.

నేను...నేను ఒక అమెరికా పౌరుడను అయినట్లైతే, నేను అమెరికాలో భాగమైయున్నాను. మరియు అది అయ్యున్నదంతా, నేను అయ్యున్నాను.

81 నేను దీనిని ఎన్నడూ మర్చిపోకూడదు. నేను ఒక నిజమైన అమెరికా పౌరుడిగా కొనసాగాలంటే, నా దేశము ఏమిటనేదానిని నేను గుర్తుంచుకోవలసియున్నాను, ఎందుకంటే నేను నా దేశముతో గుర్తించబడియున్నాను. దానిని మర్చిపోవడం, లేదా—లేదా...దానికొరకు పోరాడటానికి, లేదా దానికొరకు మరణించడానికి, లేదా అది దేనికొరకు నిలబడుతున్నదో వాటన్నిటి కొరకు నిలబడటానికి, నేను తప్పక దానికొరకు నిలబడవలసియున్నాను. నా దేశము ఏమైయున్నదో, నేను అదేయైయున్నాను. అది దేనికొరకు నిలబడుతుందో నేను దానికొరకు నిలబడతాను. ఒక నమ్మకమైన అమెరికావాడిగా ఉండటానికి, నేను దానికొరకు మరణించడానికైనా, దానికొరకు పోరాడటానికైనా, దానికొరకు నిలబడటానికైనా, దానికొరకు ఏమి చేయడానికైనా సిద్ధంగా ఉంటాను. నేను దానిలో భాగమైయున్నాను. నా జోలికి రాకుండా మీరు దాని జోలికి వెళ్ళలేరు. దానికి వ్యతిరేకముగా మీరు ఏమైనా అంటున్నప్పుడు, మీరు దానిని నాకు వ్యతిరేకముగా అంటున్నారు, ఎందుకంటే నేను ఒక అమెరికావాడినైయున్నాను. ఒక అమెరికాడ్డెయుండగా, వారు మీకు వ్యతిరేకముగా ఏదైనా అంటున్నారంటే, మరి వారు ఈ దేశానికి వ్యతిరేకముగా ఏదైనా అంటున్నారంటే, వారు దానిని మీకు వ్యతిరేకముగా అంటున్నారు, ఎందుకంటే మీరు దానిలో ఒక భాగమైయున్నారు. మీరు దానిని ఎన్నడూ మర్చిపోకండి; మీరు మర్చిపోయినప్పుడు, అప్పుడు మీకు మతిమరుపు వచ్చినట్లే, నిశ్చయంగా.

82 మరియు గుర్తుంచుకోండి, మీరు దానిలో భాగమవ్వలేనప్పుడు, మీరు ఇక ఎంతమాత్రము అమెరికా పౌరుడు కాదు. మీరు భాగమైయుండవలసియున్నారు, అమెరికా ఏమైయున్నదో, మీరు కూడా అదేయైయుండవలసియున్నారు. నేను దానిలో పాలివాడనై యుండవలసియున్నాను. ఇది నా దేశము, నేను దానిలో పాలిభాగస్థుడనైయుండాలి. అది ఏమైయున్నదో, నేను అదేయైయున్నాను. చూడండి, అది ఏమైయున్నదో, నేను అదేయైయున్నాను. అది ఏమైయున్నా పర్వాలేదు, అది ఏమైయున్నదో నేనింకను అదేయైయున్నాను.

83 ఒక అమెరికావాడనైయుండాలంటే, నేను దానితో కలిసి, అనగా ఆ పూర్వీకులతో కలిసి, నేను ప్లిమత్ బండ మీద అడుగుపెట్టాను. నేను అడుగుపెట్టవలసియున్నాను; నేను దానిలో భాగమైయున్నాను. దానికి కలుగబోవు అపాయముల గురించి దానిని హెచ్చరించడానికి, నేను పాల్ రివియర్ తో కలిసి స్వారీ చేశాను. నేను గనుక నిజమైన అమెరికా పౌరుడనైతే, నేను ప్లిమత్ బండ మీద అడుగుపెట్టాను. దాని అపాయము గురించి దానిని హెచ్చరించడానికి, నేను పాల్ రివియర్ తో కలిసి స్వారీ చేశాను. నేను ఏ అర్థముతో చెప్తున్నానో ఇప్పుడు మీరు గ్రహిస్తున్నారా?

84 నేను జార్జ్ వాసింగ్టన్ తో, పాదరక్షలు లేని అతని సైనికులతో కలిసి, ఐసీ డెలవర్ ను దాటాను. నేను అక్కడ ఉన్నాను, ఏలయనగా నేను ఈ దేశముతో గుర్తించబడ్డాను. అక్కడ అతడు చేసింది నాలో భాగమైయున్నది, నేను

ఇప్పుడు చేసేది అతనిలో భాగమైయున్నది. డెలవర్ వద్ద, నేను వాషింగ్టన్ తో గుర్తించబడ్డాను.

85 పరిస్థితులు అతనికి ఎంత ప్రతికూలంగా ఉన్నప్పటికీ, నేను స్టోన్వాల్ జ్యాక్సన్ తో నిలబడ్డాను, మరియు వారు ఇట్లడిగారు, "పరిస్థితులు నీకు వ్యతిరేకంగా ఉన్నా కూడా, నీవు ఒక రాతి గోడలాగా ఎలా నిలబడగలుగుతున్నావు?" ఆ చిన్న నీలి-రంగు కళ్ళుగల వ్యక్తి తన బూట్లతో దుమ్ములో తన్ని, "వాటి నిమిత్తము నేను సర్వశక్తిమంతుడైన దేవునికి కృతజ్ఞతలు చెల్లించేవరకు నేను ఒక గుటక మంచినీళ్ళైనా త్రాగను," అని అన్నాడు. నేను అతనితో ఒక రాతిబండలాగా నిలబడాల్సీయున్నది. నేను అక్కడ స్టోన్వాల్ జ్యాక్సన్ తో నిలబడ్డాను. ఒక అమెరికావాడనైయుండుటకు, నేను అతనితో మరియు అతడు తీసుకున్న నిర్ణయముతో గుర్తించబడ్డాను. డెలవర్ ను దాటడం! పోరాటములను పోరాడటం!

86 నేను జెండాను ఎగురవేశాను. గ్వామ్లో వారు జెండాను ఎగురవేసినప్పుడు నేను వారితో ఉన్నాను. వేలాది మంది అమెరికా సైనికులు తమ ప్రాణాలను అర్పించిన తర్వాత, ఆ చిన్న గుంపు అక్కడికి పరిగెత్తుకుంటూ వెళ్ళి మరియు ఆ జండాను అక్కడ పైకి ఎగురవేసినప్పుడు, ఆ జెండా పైకి లేస్తుండగా నేను అక్కడ గుర్తించబడ్డాను; మనలో ప్రతీ ఒక్కరూ గుర్తించబడ్డారు. గ్వామ్ పై ఎగురుతున్న ఆ జెండాతో అమెరికా పౌరులందరూ గుర్తించబడ్డారు. వారు ఆ జెండాను అక్కడ పాతారు అని నేను విన్నప్పుడు, నా చెంపల మీదుగా కన్నీళ్లు కారినవి. అది నేనే. అది మీరే. అక్కడ మనము దానితో గుర్తించబడినప్పుడు, అది మనందరము అయ్యున్నాము.

87 అది ఏమైయున్నదో, అదంతా నేను అయ్యున్నాను. దాని మహిమంతా నా మహిమయైయున్నది. దాని అవమానమమంతా నా అవమానమైయున్నది. అది గనుక అవమానకరమైన పనులను చేసినట్లైతే, అప్పుడు నేను దాని...దాని అవమానమును భరించవలసియుంటుంది. అది మహిమను పొందుకుంటే, నేను కూడ దానితోపాటు మహిమను పొందుకుంటాను, ఎందుకంటే నేను దానితో గుర్తించబడ్డాను. ఇప్పుడు, గుర్తించబడటానికి, ఒక అమెరికావాడు అమెరికాయొక్క అవమానమంతటినీ, అమెరికాయొక్క మహిమయంతటినీ, అది ఏమైయున్నదో దానంతటినీ భరించవలసియున్నాడు. అది ఏమైయున్నదో, లేదా భవిష్యత్తులో అది ఏమైయుంటుందో, దానంతటితో మీరు గుర్తించబడ్డారు.

88 ఇప్పుడు, ఒక నిజమైన క్రైస్తవుడైయుండటానికి, మీరు ఆ విధంగానే ఉండవలసియున్నారు. మనము దానిని మర్చిపోకూడదు. ఆయన ఏమైయున్నాడో, దానంతటితో నేను గుర్తించబడ్డాను. నేను ఆయనతో గుర్తించబడ్డాను.

89 గమనించండి, మరియు ఆయనలో నాలో ఉన్నాడు, మరియు నేను ఆయనలో ఉన్నాను. గమనించండి, అలాగైతే, "జగత్తుపునాది వేయబడకముందే, ఉదయనక్షత్రములు ఏకముగా గానము చేసినప్పుడు మరియు దేవుని కుమారులందరూ సంతోషముతో కేకలు వేసినప్పుడు," ప్రతీ క్రైస్తవుడు—అంటే నిజమైన అసలైన క్రైస్తవుడైన ప్రతీ క్రైస్తవుడు, ఆయనతో ఉన్నారు. అసలు ప్రపంచమనేది సృష్టించబడటానికి పది మిలియన్ల సంవత్సరాల క్రితమే,

అమర్త్యమైన పరిధులలో మనము దేవునితో గుర్తించబడ్డాము. ఆ వెనుక అక్కడ నేను ఆయనతో ఉన్నాను. నేను గనుక నిత్యజీవమును కలిగియున్నట్లైతే, నేను అక్కడ ఆయనతో ఉన్నాను. "ఉదయనక్షత్రములు ఏకముగా కూడి పాడినప్పుడు మరియు దేవుని కుమారులు ఆనందించి జయధ్వనులు చేసినప్పుడు," నేను ఆయనతో గుర్తించబడ్డాను.

90 అబ్రాహాముకు డెబ్బై-ఐదు సంవత్సరాలు, మరియు అతని భార్యకు అరవై-ఐదు సంవత్సరాల వయస్సప్పుడు, ఆయన అతణ్ణి పిలిచి మరియు వారు ఒక బిడ్డను కనబోతున్నారని అతనికి చెప్పినప్పుడు నేను ఆయనతో ఉన్నాను. **యెహోవా ఈలాగు సెలవిచ్చున్నాడు** మీద అతడు నిలబడి, "నేను ఆ బిడ్డను పొందుకోబోతున్నాను" అని చెప్పినప్పుడు నేను అతనితో ఉన్నాను. నేను అతనితో కూడ నిలబడ్డాను. ప్రతీ క్రైస్తవుడు అతనితో నిలబడ్డాడు. అతనికి శోధనలు వచ్చినప్పుడు నేను అతనితో కూడ ఉన్నాను. ఇస్సాకును బలి ఇవ్వడానికి, అతడు ఆ కొండ పైకి వెళ్ళినప్పుడు నేను అతనితో కూడ ఉన్నాను. ఆ గొర్రెపిల్ల ప్రత్యక్షమైనప్పుడు నేను అతనితో కూడ ఉన్నాను.

91 అతడు ఆత్మసంబంధియైయుండి మరియు మిగతావారందరూ శరీరసంబంధులై యుండుటను బట్టి, యోసేపు తన సహోదరులచేత తృణీకరించబడినప్పుడు నేను అతనితో కూడ ఉన్నాను. అతని స్వంత అన్నల వలన అతడు ఎదుర్కోవాల్సివచ్చే నింద గురించి అతడు ఎరిగినప్పుడు నేను అతనితో కూడ ఉన్నాను. అతడు ఏమైయున్నాడో, నేను అది అయ్యున్నాను. నేను ఏమైయున్నానో, అతడు అది అయ్యున్నాడు. "ఏలయనగా క్రీస్తుయేసునందు మనమందరము ఒక్కటైయున్నాము." అతని గుహలో, సమాధిలో నేను యోసేపుతో కూడ ఉన్నాను. అతడు ఫరోయొక్క కుడిపార్శ్వమునకు వెళ్ళినప్పుడు నేను అతనితో కూడ ఉన్నాను. మీరు అతనితో గుర్తించబడవలసియున్నారు.

92 ఆ రాత్రి యాకోబు రాత్రంతా ఆ దూతతో పోరాడినప్పుడు నేను అతనితో కూడ ఉన్నాను. స్వయంగా నేను కూడా, పోరాడాను. అతడు దేనిగుండా వెళ్ళాడో నాకు తెలుసు. కాబట్టి అతడు పోరాడిన అదే సమయములో యాకోబుతో కలిసి నేను కూడ పోరాడాను, ఎందుకంటే నేను అతని సహోదరుడనైయున్నాను.

93 మోషే ఐగుప్తుకు వెళ్ళినప్పుడు నేను అతనితో కూడ ఉన్నాను. మండుచున్న పొద దగ్గర నేను మోషేతో కూడ ఉన్నాను. మీరు ఒక క్రైస్తవుడైతే, మీరు బైబిలులోని ఆ పాత్రలతో గుర్తించబడతారు. దానిని మర్చిపోకండి! ప్రజలందరూ అతనికి వ్యతిరేకమైనప్పుడు నేను మోషేతో కూడ ఉన్నాను. మోషే ఎర్ర సముద్రమును దాటినప్పుడు నేను అతనితో కూడ ఉన్నాను. అతడు తన చేతిని పైకెత్తి ముందుకు నడచినప్పుడు, మరియు ఎర్ర సముద్రము తెరువబడినప్పుడు, సరిగ్గా అప్పుడే నేను క్రీస్తులో గుర్తించబడ్డాను, మరియు ఆ ఘడియలో నేను మోషేతో కూడ ఉన్నాను.

94 పూర్వం క్రైస్తవులు ఏమైయున్నారో, విశ్వాసులు ఏమైయున్నారో, ఇప్పుడున్న ప్రతీ విశ్వాసి ఆ వ్యక్తితో గుర్తించబడ్డారు. అదేమైనా గానీ, మీరు గుర్తించబడవలసియున్నారు. దానిని మర్చిపోకండి. మీరు మర్చిపోయినప్పుడు, మీకు ఆత్మీయ మతిమరుపు వచ్చిందనమాట; మీరు ఎవరన్నది మీరు మర్చిపోయారు.

95 ఇప్పుడు అతనితో గుర్తించబడ్డాను, మోషే ఎర్ర సముద్రమును దాటినప్పుడు, అతనితో గుర్తించబడ్డాను.

96 ఆహాబు దినములలో, వారు ఎవరిని సేవిస్తారని, దేవుడిని సేవిస్తారా లేదా బిలాముని సేవిస్తారా అని ఎంపిక చేసుకోవలసివచ్చినప్పుడు, నేను ఏలీయాతో కూడ ఉన్నాను. అతడు ఈ ఎంపికను చేసుకోవలసి వచ్చినప్పుడు, కర్మేలు పర్వతము మీద మనము అతనితో కూడ ఉన్నాము, ఎందుకంటే అతడు ఎవరి శరీరములోనైతే గుర్తించబడ్డాడో మనము కూడా అదే దేవుని శరీరములో గుర్తించబడ్డాము. కాబట్టి మనము ఆ శరీరములో గుర్తించబడితే, అటువంటప్పుడు అక్కడ మనము అతనితో కూడా ఉన్నామని మనము గుర్తుంచుకోవాలి. అది నిజము.

97 ఇప్పుడు, దావీదు తన స్వంత సహోదరులచేత త్రోసివేయబడినప్పుడు, నేను అతనితో కూడ ఉన్నాను. నేను దావీదుతో ఉన్నాను; మీరు ఒక క్రైస్తవుడైనట్లైతే మీరు కూడా ఉన్నారు. అతని తృణీకరణలో మీరు అతని పక్షమున గుర్తించబడవలసియున్నారు.

98 ఆ హెబ్రీ పిల్లలు అగ్ని గుండములో ఉండగా, నాలుగవ వ్యక్తియొక్క సన్నిధి వలన, ఆ——ఆ అగ్ని వారిని దహించలేకపోయినప్పుడు నేను వారితో కూడ ఉన్నాను.

99 సింహాల బోనులో, నేను దానియేలుతో కూడ ఉన్నాను. ప్రభువుయొక్క దూత అక్కడ అతణ్ణి గుర్తించినప్పుడు, నేను అక్కడ గుర్తించబడ్డాను.

100 కల్వరి వద్ద ఎంతో నిశ్చయంగా నేను ఆయనతో కూడ ఉన్నాను. కల్వరి వద్ద తప్పకుండా నేను ఆయనతో గుర్తించబడాలి. నేను అక్కడ ఎంతగా ఉండవలసియున్నానంటే, నేను కల్వరి వద్ద ఆయనతో గుర్తించబడటం మాత్రమే కాదు గాని, కల్వరిలో నేను ఆయనతో కూడ మరణించాను. ప్రతీ క్రైస్తవుడు కల్వరిలో ఆయనతో కూడ మరణించవలసియున్నాడు. కల్వరి వద్ద మీరు ఆయనతో కూడ మరణించకపోతే, మీరు ఆయనవాటిలో దేనికి చెందియుండలేరు. ఆయన మరణించినప్పుడు నేను అక్కడ ఉన్నాను. నేను ఆయనతో కూడ మరణించాను. మరియు పిదప ఆయన మృతులలో నుండి లేచినప్పుడు నేను ఆయనతో కూడ అక్కడ ఉన్నాను. ఈస్టరు ఉదయమున, పునరుత్థానములో నేను ఆయనతో కూడ పైకి లేచాను. ఆయన ఏమేమి చేశాడో, వాటన్నిటిలో నేను సరిగ్గా అక్కడ ఆయనతో కూడ ఉన్నాను; ప్రతీ విశ్వాసి అంతే.

101 మరియు ఆయన ద్వారా పాతాళపు శక్తులన్నీ జయించబడి, ఇప్పుడు క్రీస్తుయేసులో ఆయనతో కూడ, నేను పరలోకపు స్థలములలో కూర్చోబెట్టబడ్డాను. ప్రతీ క్రైస్తవ విశ్వాసి ఆ విధంగానే కూర్చోబెట్టబడ్డాడు, ఎందుకంటే మీరు గుర్తించబడవలసియున్నారు.

102 ఈ అంత్య దినములలో, ఆయన పరిచర్యలో గుర్తించబడిన, అనేకమంది విశ్వసించే క్రైస్తవులతో, ఇప్పుడు నన్ను నేను కనుగొన్నాను. “ఆయన నిన్నా, నేడు, మరియు నిరంతరము ఒక్కటేరీతిగా ఉన్నాడు.” ఈ దినమున, నన్ను నేను, ఆయన పరిచర్యలో గుర్తించబడినవాడిగా కనుగొన్నాను. దానిని నమ్ముతూ, దానితో నడుస్తూ, మీరు కూడా మిమ్మల్ని మీరు ఆ విధంగా కనుగొంటున్నారా?

గమనించండి, ఆయన చేసిన క్రియలు, ఒక విశ్వాసి అవే క్రియలను చేస్తాడని ఆయన చెప్పాడు. "నేను చేయు క్రియలు మీరును చేయుదురు." అలాగైతే మీరును ఆయనతో గుర్తించబడగలరా? పిదప వాక్యమును బట్టి నింద వచ్చినప్పుడు, మీరు కూడా ఆయనలాగా నిందను భరించి నిలబడగలరా, చూడండి, ఆయనతో గుర్తించబడగలరా? నేను ఆయనతో గుర్తించబడ్డాను.

103 పెంతెకొస్తు దినమున నేను ఆయనతో ఉన్నాను. నేను పైన అక్కడ శిష్యులతో కూడ ఉన్నాను, పరిశుద్ధాత్మ బాప్తిస్మములో వారితో కూడ గుర్తించబడ్డాను.

104 ఇప్పుడు వారు అసలు, వారిలో కొందరు అసలు కనీసం పరిశుద్ధాత్మ అనేది ఒకటి ఉందని కూడా నమ్మలేనంతగా, సంఘము మతిమరుపు స్థితికి రాలేదా అని నేను ఆశ్చర్యపోతున్నాను. సంఘము ఎటువంటి స్థితికి వచ్చిందో చూస్తున్నారా? చాలా తీవ్రంగా ఉన్న మతిమరుపు! చూడండి, ఆ వెనుక అక్కడున్నది యేసుక్రీస్తే అని వారు మర్చిపోయారు. యేసుక్రీస్తు ఏమైయున్నాడన్నది వారు మర్చిపోయారు. వారు మర్చిపోయారు. ఆయన కేవలం ఒక—ఒక ధర్మశాస్త్ర-కర్తయని, లేదా ఒక ప్రవక్తయని, లేదా ఒక—ఒక మంచి వ్యక్తియని వారు అనుకున్నారు. ఆయన దేవుడని వారు మర్చిపోయారు. ఆయన నిన్నా, నేడు, మరియు నిరంతరము ఒక్కటేరీతిగా ఉన్నాడని వారు మర్చిపోయారు. సంఘము తీవ్రమైన ఆత్మీయ మతిమరుపును కలిగియున్నది. వారు ఈ కార్యములన్నిటినీ మర్చిపోయారు. వారు ఇక ఎంతమాత్రము దానిని గ్రహించరు.

105 మనము పెంతెకొస్తు వద్ద శిష్యులతో ఉండవలసి యున్నాము, వారితో గుర్తించబడవలసి యున్నాము. అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయంలో, పెంతెకొస్తు దినమున పేతురుయొక్క ప్రసంగముతో నేను గుర్తించబడ్డాను. అతడు చెప్పినదానిని నేను విన్నాను. అతడు చెప్పినదానిని నేను నమ్మియున్నాను. అతడు చెప్పిన దానికి నేను విధేయుడనయ్యాను. ఇప్పుడు నేను అదే విషయములో గుర్తించబడ్డాను.

106 ఆత్మీయ మతిమరుపును పొందుకోకండి. ఎందుకంటే, మీరు, మిమ్మల్ని మీరు మరిదేనితోనో గుర్తింపజేసుకుంటారు. సరిగ్గా ఆ వాక్యముతోనే నిలిచియుండండి!

107 అపొస్తలుల కార్యములు, 16వ అధ్యాయములో, యేసుక్రీస్తు ద్వారా దానికి ఆజ్ఞ ఇవ్వబడినప్పుడు, మనము సంఘముతో ఉన్నాము. "మీరు సర్వలోకమునకు వెళ్ళి, మరియు సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి." నేను అక్కడ గుర్తించబడగోరుతున్నాను, "సర్వలోకమునకు, సర్వసృష్టికి." "నమ్మినవారిని ఈ సూచకక్రియలు వెంబడించును," దానిలో గుర్తించబడగలను.

108 మంచిది, ఇప్పుడు, మీరు దానితో గుర్తించబడ్డారా, లేదా విశ్వాసులను ఆ సూచకక్రియలు వెంబడిస్తాయని మీరు నమ్మడంలేదని, మీరు కనుగొనేంతగా మీకు కొంత ఆత్మీయ మతిమరుపు వచ్చిందా? చూడండి, మీరు దానిని నమ్మకపోతే, అప్పుడు మీరు ఆత్మీయ మతిమరుపును కలిగియున్నట్లే, చూడండి, దేవుడు దానిని వాగ్దానము చేశాడనే విషయాన్ని మీరు మర్చిపోయారు. ఆయన ఇట్లన్నాడు, "నమ్మినవారిని ఈ సూచకక్రియలు వెంబడించును." దానిని

మర్చిపోకండి. మీరు దానిని మరచిపోయి ఒక క్రైస్తవునిగా ఉండలేరు. మీరు దానితో గుర్తించబడవలసియున్నారు.

109 మీరు పరిశుద్ధ యోహాను 14వ అధ్యాయము, 12వ వచనముతో గుర్తించబడవలసియున్నారు. "నాతో కూడ విశ్వాసముంచువాడు, నేను చేయు క్రియలు అతడును చేయును." దానిని మర్చిపోకండి. మీరు మర్చిపోయినట్లైతే, అప్పుడు మీరు ఆత్మీయ మతిమరుపును కలిగియున్నట్లే. మీరు ఎవరన్నది మీరు మర్చిపోయారు. మీ సాక్ష్యము అంటే ఏమిటో మీరు మర్చిపోయారు.

110 "నాయందు మీరును, మీయందు నా మాటలును నిలచియుండినయెడల, మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును" అని, ఆయన చెప్పినదాని సంగతి ఏమిటి? అది సత్యమని నమ్మేటట్లుగా, మీరు అక్కడ గుర్తించబడ్డారా? మార్కు 11, "ఈ కొండను చూచి, 'కదలిపొమ్ము,' అని చెప్పి, మరియు మీ హృదయములో సందేహింపక, మీరు చెప్పినది జరుగునని నమ్మినయెడల, మీరు చెప్పిన దానిని మీరు పొందుకోగలరు," అని ఆయన చెప్పాడు. అది సత్యమని నమ్మేటట్లుగా, మీరు అక్కడ గుర్తించబడగలరా? అలా కానియెడల, అప్పుడు మీరు ఆత్మీయ మతిమరుపును పొందుకుంటున్నారు.

111 మరియు——మరియు మీరు మర్చిపోతారు, మీరు మీ క్రైస్తవ సమతుల్యతను కోల్పోతారు. మీరు ఎక్కడికి చెందినవారో మీరు చెప్పలేరు. మీరు ఇట్లంటారు, "నేను మెథడిస్టును. నేను బ్యాప్టిస్టును. దాని గురించి నాకు తెలిసినదంతా అంతే. నేను పెంతెకొస్తువాడను. నేను ఇది, అది, లేదా ఆ మరొకటి అయ్యున్నాను." గమనించండి! దాని అర్థం ఆ వ్యాధి లక్షణం మీలో కనిపిస్తుందని, మీకు కొంచెం ఆత్మీయ మతిమరుపు వచ్చిందని కావచ్చు.

112 మీరు ఇట్లంటారు, "సరే, సహోదరుడా బ్రెన్హామ్, నేను——నేను దీనిని నమ్ముతున్నాను, మరియు నేను——నేను కనీసం---" ఇప్పుడు కేవలం ఒక్క నిమిషం ఆగండి. దేవుడు ఈ సంగతులను చేస్తానని వాగ్దానము చేసి, మరియు ఈ అంత్యదినములలో అవి జరుగుతాయని చెప్పినట్లైతే, మరి మీ మతాచారములు వాటినుండి మిమ్మల్ని దూరంగా ఉంచితే, అ వ్యాధి లక్షణం మీపై ఉన్నదని నేను చూడగలుగుటకు అదొక మంచి సూచనయైయున్నది. అది ఆత్మీయ మతిమరుపైయున్నది. మీరు వాక్యముతో మిమ్మల్ని మీరు గుర్తింపజేసుకోడాన్ని మర్చిపోయారు.

113 మీరు ఇట్లంటారు, "వ్యాధిగ్రస్తులు స్వస్థపరచబడ్డారంటే నేను నమ్మను." మీకు ఆత్మీయ మతిమరుపు ఉన్నది.

114 మీరు ఇట్లంటారు, "పరిశుద్ధాత్మ బాప్తిస్మమును నేను నమ్మను." ఆత్మీయ మతిమరుపు!

115 "దేవుడు అంత్య దినములలో ఈ కార్యములను చేస్తాడని వాగ్దానము చేశాడని నేను——నేను నమ్మను," అని మీరు అంటారు. అప్పుడు మీరు బైబిలుకు బదులుగా, ఒక సిద్ధాంతమును, లేదా ఏదో ఒక మతాచారమును విన్నారు. మీరు ఆత్మీయ మతిమరుపును కలిగియున్నారు. అప్పుడు మీరెక్కడికి చెందియున్నారో మీకు తెలియదు. మీరు "ఒక క్రైస్తవుడు," అని ఒప్పుకుంటున్నారు, కానీ వాక్యమును నిరాకరిస్తున్నారు. అది మరలా మిమ్మల్ని ఆత్మీయ మతిమరుపు స్థితికి

తీసుకువస్తుంది, చూడండి, మీరు ఎక్కడ నిలబడ్డారో తెలియదు. మీకు ఆత్మీయ మతిమరుపు వచ్చింది. మీరు లేఖనాలతో మిమ్మల్ని మీరు గుర్తించుకోలేరు.

116 మీరు శిష్యులతో ఉండవలసియున్నది. మీరు లేఖనమంతటితో ఉండవలసియున్నారు, అది ఆజ్ఞాపించబడినప్పుడు సంఘముతో ఉండవలసియున్నారు. అయితే, ఇప్పుడు, సంఘమునకు ఇట్లు ఆజ్ఞాపించబడినప్పుడు, "మీరు సర్వలోకమునకు వెళ్ళి మరియు సువార్తను ప్రకటించుడి; నమ్మినవారిని ఈ సూచక క్రియలు వెంబడించును," అది ఆమెకు ఇవ్వబడిన ఆజ్ఞయైయున్నది. ఇప్పుడు వారు---అది ఆజ్ఞయైయున్నది.

117 అయితే వారు ఈ ఆత్మీయ మతిమరుపును తీవ్రంగా కలిగియున్నారు, సరిగ్గా హవ్వకు---ఒక దినమున, ఏదెను తోటలో తిరుగుతుండగా, ఆమెకు కలిగినట్లే ఉన్నది. ఇప్పుడు ఆమె ఇశ్రాయేలు వలెయున్నది, అదే రోగముతో బాధపడుచున్నది, మీకు ఆత్మీయ మతిమరుపును కలిగించే ఒక సెమినరీ బోధన అనే ఆహారమువల్ల వచ్చే అలెర్జీయైయున్నది. కొంచెము సెమినరీ బోధన అనే ఆహారము తీసుకున్నారంటే, మరి మీకు అలెర్జీ వస్తుంది, మరియు పిదప, మొదటి విషయం మీకు తెలుసా, మీకు తీవ్రమైన మతిమరుపు వస్తుంది. బైబిలు గ్రంథము చెప్పే దేనినైనా మీరు నమ్మరు.

118 ఈనాడు సంఘముతో వచ్చిన సమస్య అదేయైయున్నది. ఈనాడు మనము ఉజ్జీవమును కలిగియుండకపోడానికి కారణం అదేయైయున్నది. ఈనాడు ప్రజలతో సమస్య అదేయైయున్నది. ప్రతిదానితోను, మరియు ఉద్భవించగల ప్రతీ సిద్ధాంతముతోను, మరియు ప్రతీ ఇజముతోను వారు ఎంతగానో గందరగోళంలోకీ పడవేయబడ్డారు, ఎంతగా అంటే చివరికి ఏది ఒప్పో మరియు ఏది తప్పో వారికి తెలియడం లేదు. ఖచ్చితంగా. ఆమె తన ప్రభువును జ్ఞాపకం చేసుకోలేకపోతుంది. ఆయన వాక్యమును ఆమె జ్ఞాపకం చేసుకోలేకపోతుంది. వాగ్దానమును ఆమె జ్ఞాపకం చేసుకోలేకపోతుంది.

119 యేసు రంగం మీదకు వచ్చినప్పుడు, సరిగ్గా ఇశ్రాయేలుతో సమస్య అదేయైయున్నది. "ఒక కన్యక గర్భవతియగును," అనేది, వారు జ్ఞాపకం చేసుకోలేకపోయారు. "ప్రభువైన మీ దేవుడు నావంటి ఒక ప్రవక్తను లేపును," అని మోషే చెప్పాడన్నది వారు జ్ఞాపకం చేసుకోలేకపోయారు. వారు ఆత్మీయ మతిమరుపును కలిగియున్నారు.

120 ఈనాడు సంఘము సరిగ్గా దానినే కలిగియున్నది. "అంత్య దినములలో ఇవి జరుగును," అని ఆయన చెప్పాడు, ఏవైతే జరగడాన్ని మనము చూస్తున్నామో, అట్టి ఈ సంగతులు జరుగుతాయని చెప్పాడు, మరియు సంఘము పూర్తిగా మృతమైన స్థితిలో కూర్చొనియుంటుంది. అది ఏమిటి? ఆత్మీయ మతిమరుపు. మనల్ని మనము పెంతెకొస్తులమని చెప్పుకుంటాము, కానీ గుర్తింపజేసుకోలేకపోతున్నాము, మరియు క్రీస్తుయొక్క పునరుత్థాన శక్తిలో వాక్యము ప్రకటింపబడుచుండగా మనము దానితో గుర్తింపజేసుకోలేకపోతున్నాము; మరి ఇక్కడేమో ఆయన మన మధ్యలో ఉండి, దానిని ప్రదర్శిస్తూ, మరియు అది ఏమి చేస్తుందని ఆయన చెప్పాడో సరిగ్గా దానినే చేస్తున్నాడు. పిదప, గమనించండి, మన సంఘశాఖ వ్యవస్థ మనల్ని ఆత్మీయ మతిమరుపులోకి తీసుకువచ్చింది. మనం బాధపడుచున్నాము. మనం ఎక్కడికి

చెందినవారమో మనము ఎరుగకయున్నాము. ఒకడు తన సభ్యత్వ పత్రాలను ఈ సంఘము నుండి మరొక సంఘమునకు మరియు ఈ సంఘమునకు, మరియు ఈ ఇజముకు మరియు ఆ ఇజముకు తీసుకెళ్తాడు. చూశారా?

121 మనకు అవసరమైనది, ఏమిటంటే, మరలా, మరొక ఆమోసు, **యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు** తో, రంగము మీదికి రావడమైయున్నది. మనము అతణ్ణి స్వీకరిస్తామా? వారు చేసినట్లే చేస్తాము. వారు అతణ్ణి ఎన్నడూ స్వీకరించలేదు. ఈ రోజున కూడా వారు అతణ్ణి స్వీకరించరు. ఆయన బోధించడానికి ఒక స్థలం దొరకడం కూడా, దాదాపు, కష్టమైపోయింది. ఇప్పుడు, అది ఖచ్చితంగా సరియే, ఎందుకంటే సంఘము ఈ ఆత్మీయ మతిమరుపుతో బాధపడుచున్నది.

122 ఇప్పుడు, ఏమిటి? "ఈ చివరి దినములలో దేవుడు ఇట్లు వాగ్దానము చేశాడు, "మనుష్యకుమారుడు ప్రత్యక్షపరచబడునప్పుడు," లూకా, 17వ అధ్యాయం ప్రకారంగా, "సొదొమ వద్ద జరుగుచున్న ఆ సూచన, మరలా జరుగును." మరి అది జరగడాన్ని ప్రజలు చూశారు, మరియు వారిలో కొందరు దానిని అసలు నమ్మరు. అది మనస్సులను చదువుట అని వారు అనుకుంటారు. అది ఒక దయ్యపు ఆత్మ అని వారు అనుకొంటారు. అది ఏమిటి? వారు ఆత్మీయ మతిమరుపుతో బాధపడుతున్నారు. ఖచ్చితంగా అంతే. వారు ప్రభువును గ్రహించలేరు. "యేసుక్రీస్తు నిన్నా, నేడు, మరియు నిరంతరము ఒక్కటేరీతిగా ఉన్నాడు." ఆయన అప్పుడు ఏమైయున్నాడో, ఆయన ఇప్పుడూ అదేయైయున్నాడు.

123 అయితే, ఏమి జరిగిందంటే, మనల్ని మనం ఇక ఎంతమాత్రము వాక్యముతో గుర్తించుకోలేకపోతున్నాము. ఎందుకు? ఆమె, ఆమె ఒక లాడ్జీయా లేక ఆమె ఒక సంఘమా అన్నది ఆమెకి తెలియదు. ఆమె ఒక లాడ్జీగా పిలువబడగోరడంలేదు, మరియు ఆమె ఒక సంఘము అని పిలువబడజాలదు; ఎందుకనగా, ఒక సంఘము అని పిలువబడాలంటే, ఆమె తననుతాను క్రీస్తుతో గుర్తింపజేసుకోడమే అవుతుంది. అది ఆమెకు ఆత్మీయ మతిమరుపును కలుగజేస్తుంది. మరియు ఆమె ఒక లాడ్జీగా పిలువబడగోరడంలేదు. కాబట్టి అది పెంతెకొస్తు సంఘము కాదు, మెథడిస్టు సంఘము కాదు, బాప్టిస్టు సంఘము కాదు; అది పెంతెకొస్తు లాడ్జి, మెథడిస్టు లాడ్జి, మరియు బాప్టిస్టు లాడ్జియై యున్నది, ఎందుకంటే ఆమె వాక్యముతో గుర్తింపబడలేకపోతున్నది. మరియు వాక్యము ప్రత్యక్షపరచబడినపుడు, వారు ఇంకనూ దానిని నమ్మడం లేదు. అది ఆత్మీయ మతిమరుపు, అనే వ్యాధియైయున్నది. వారు తమనుతాము గుర్తించుకోలేకపోతున్నారు; వారు ఎక్కడికి చెందినవారో వారికి తెలియదు. అది నిజం.

124 అది సరిగ్గా దేనినైనా సంకరం చేయడం వంటిదైయున్నది. నేను తరచుగా చెప్పినట్లు, "నేను ఎప్పుడైనా చూసినవాటిలో అత్యంత తెలివితక్కువైనది కంచర గాడిదే అని నేను ఎల్లప్పుడూ అనుకునేవాణ్ణి." చూడండి, అదొక సంకర జాతియైయున్నది. చూడండి, దాని తల్లి ఒక గుర్రము, దాని తండ్రి ఒక గాడిదయైయున్నది, మరియు అది దేనికి చెందినదో కూడా దానికి తెలియదు. మరియు మొదటి విషయం ఏమిటో మీకు తెలుసా, మీరు—మీరు—మీరు—మీరు వాటిని కట్టించి మరియు ఒక గాడిదను పొందుకోవచ్చు,

మరియు పిదప...లేదా ఒక కంచర గాడిదను పొందుకోవచ్చు, కానీ ఆ కంచర గాడిద తిరిగి దానినది ఉత్పత్తి చేయలేదు. చూడండి, అది ఉత్పత్తి చేయదు. మీరు దానికి ఏమీ నేర్పించలేరు. అది మంద-బుద్ధిగలది. మీరు దానికి ఎన్నడూ ఏమీ చెప్పలేరు...అవి ఆ పెద్ద పాడవైన చెవులను నిక్కబార్చడాన్ని మీరు చూడగలరు. మరియు అది, చివరి రోజు వరకు, అది చనిపోయే క్షణం వరకు కూడా, మిమ్మల్ని తన్నడానికే, వేచిచూస్తుంది. అంతే. దానికి సాధ్యమైతే, మీ మీద దాడి చేయడానికి అది ఎల్లప్పుడూ వేచిచూస్తున్నది.

125 మరియు అనేకమంది నామకార్థ సంకరమైన-క్రైస్తవులను ఆది నాకు గుర్తుచేస్తున్నది. వారికి ఆత్మీయ మతిమరుపు అనే రోగము వచ్చేంతగా వారు సంఘమును సంకరము చేశారు. వారు మరలా దేనినీ ఉత్పత్తి చేయలేరు.

126 వారు సంకరజాతి మొక్కజొన్న గురించి మాట్లాడుతారు. సంకరజాతి మొక్కజొన్నలో అసలేమీ లేదు. అది మీరు తినేవాటిలో అత్యంత చెడ్డదైయున్నది, సంకరపు ఆహారమేదైనా అంతే. ఆ కారణముచేతనే మీరు ఈ చిన్న కృత్రిమవేడితో పెంచే మొక్కలను, మరియు సంకరజాతివాటిని తీసుకొని, వాటికి మందుకొట్టి మరియు చికిత్స చేసి మరియు వాటిని జాగ్రత్తగా చూసుకోవాల్సియుంటుంది. ఎందుకు? ఎందుకంటే అవి ఆ పురుగులు వాటి మీదకు రాకుండా ఆపలేవు.

127 కానీ అసలైన, స్వచ్ఛమైన జాతికి చెందినదానికి, మీరు ఎలాంటి క్రిమినాశక మందును వేయవలసిన అవసరం లేదు. దానిపై పురుగులు రాకుండా కాపాడుకునే శక్తిని, అది దానిలోనే కలిగియున్నది. ఒక నిజమైన అసలైన-ఆత్మనింపుదల గల వ్యక్తి నుండి అవిశ్వాసపు పురుగులను దూరంగా ఉంచడానికి కావలసింది కూడా అదేయైయున్నది.

128 ఒక పాత కంచర గాడిదను తీసుకొని, మరియు దానితో మాట్లాడటం మొదలుపెట్టండి, "హే, అబ్బాయ్, నీవు *దీనిని, దానిని* చేయాలని నేను కోరుతున్నాను," అని చెప్పారనుకోండి.

129 అది అక్కడ కూర్చొని, "హా! హా! హా!" అని అరుస్తూ ఉంటుంది. దాని పెద్ద చెవులు పైకి-మరియు-క్రిందకి కదులుతూ ఉంటాయి. అలా ఉన్న క్రైస్తవులను, క్రైస్తవులమని పిలుచుకునే-చాలామందిని నేను చూశాను.

130 మీరు ఇట్లంటారు, "యేసుక్రీస్తు నిన్నా, మరియు నిరంతరము ఒక్కటేరీతిగా ఉన్నాడు. నమ్మినవారిని ఈ సూచకక్రియలు వెంబడించును."

131 "హా? అద్భుతాలు జరిగే దినములు గతించాయని నేను నమ్ముతాను. హా? హా? హా?" చూడండి, అది ఏమి నమ్ముతుందో దానికే తెలియదు. దానికి అసలు ఏమీ తెలియదు. అది ఎక్కడ నుండి వచ్చిందో దానికి తెలియదు; అది ఎక్కడికి వెళ్తున్నదో దానికి తెలియదు. దానికి గుర్రపు మతిమరుపు వచ్చింది. అది ఎక్కడి నుండి వచ్చిందో దానికి తెలియదు, మరియు అది ఇక ముందుకు కూడా వెళ్ళలేదు.

132 కానీ నేను ఒక స్వచ్ఛమైన జాతి గుర్రమును ఇష్టపడతాను. ఓ, అది చాలా మచ్చికగా ఉంటుంది. మీరు దానితో మాట్లాడగలరు. దానికి దాని తండ్రి ఎవరో తెలుసు, దాని తల్లి ఎవరో తెలుసు, దాని తాతయ్య మరియు నాయనమ్మ ఎవరో

దానికి తెలుసు. అది ఎక్కడి నుండి వచ్చిందో చూపించడానికి దాని దగ్గర జాతి పత్రాలు ఉన్నాయి.

133 మరియు ఆ వెనుక దేవునియొక్క వాక్యము నొద్దకు, పెంతెకొస్తు దినము వద్దకు వెళ్ళగలిగి మరియు ఎక్కడైతే పరిశుద్ధాత్మ యొక్క శక్తి వారిపైకి వచ్చిందో, అట్టి పరిశుద్ధులతో తమనుతాము గుర్తింపజేసుకునే, ఒక స్వచ్ఛమైన జాతి క్రైస్తవుణ్ణి నేను ఇష్టపడతాను. ఒక స్వచ్ఛ జాతి క్రైస్తవుడంటే అది. అతడు ఎక్కడ నుండి వచ్చాడో అతనికి తెలుసు. అతడు మెథడిస్టు, బ్యాప్టిస్టు, లేదా మరి దేనితోనూ గుర్తించబడడు. అతడు దేవునియొక్క వాక్యములో గుర్తించబడతాడు. అతడు సరిగ్గా ఎక్కడ నిలబడియున్నాడో అతనికి తెలుసు. అతని తండ్రియొక్క రాజవంశపు రక్తము అతనిగుండా ప్రవహిస్తుంది; అది యేసుక్రీస్తుయొక్క రక్తమైయున్నది. అది ఏమి చేస్తుందో అతనికి తెలుసు! అతడు ప్రతీ మాటను నమ్ముతాడు. దేవుడు అతని ద్వారా పనిచేస్తూ మరియు వెంబడిస్తాయని ఆయన వాగ్దానము చేసిన సూచకక్రియలతో దానిని నిర్ధారిస్తాడు. అతడికి ఎటువంటి ఆత్మీయ మతిమరుపు లేదు. అతడు ఒక అసలైన స్వచ్ఛమైన జాతికి చెందినవాడు. నేను దానిని ఇష్టపడతాను.

134 అయితే ఈనాటి సంఘము దారుణమైన ఆత్మీయ మతిమరుపుతో బాధపడుతున్నది. అది ఎక్కడికి చెందియున్నదో దానికి తెలియదు. అది దాని గురించి అంతా మర్చిపోయింది, దానిని ఒక సంఘముగా చేసే ఈ విషయాలన్నిటినీ మర్చిపోయింది.

135 మనల్ని ఇంత సంపన్నులుగా చేసింది ఏమిటి? అది మరలా లవొదికయ స్థితికి వచ్చినది, తిరిగి ఇశ్రాయేలు ఉన్నట్టి ఆ సంపన్నమైన స్థితికి వచ్చినది. అది పేదరికంలో ఉండి అది చేయగలిగిన ప్రతిదాని కొరకు, అది పొందుకున్న ప్రతిదాని కొరకు, దేవునిపై ఆధారపడవలసి వచ్చినప్పుడు, అది దేవుడిని నమ్మినది; అప్పుడు దేవుడు దానితో ఉన్నాడు, మరియు అది ఆత్మీయంగా ఉండి ముందుకు కొనసాగినది. కానీ అది ఎప్పుడైతే ధనవృద్ధి చేసుకున్నదో, మరి జరిగింది ఇదేయైయున్నది: వారి పట్టణాలు అభివృద్ధి చెందాయి, మరియు వారి స్త్రీలు అనైతికంగా మారిపోయారు, వారి పురుషులు దానిని అనుమతించారు, వారి బోధకులు ప్రమాణాలను దిగజార్చారు, మరియు వారు ప్రవక్తలను తృణీకరించారు. మరియు వారు అటువంటి పరిస్థితిలోకి వెళ్లిపోయారు. దానికి కారణం ఏమిటంటే, ఆ ఆశీర్వాదములు ఎక్కడి నుండి వచ్చాయో వారు మర్చిపోవడం వలనేయైయున్నది.

136 మరియు మెథడిస్టులైన మీరు, బ్యాప్టిస్టులైన మీరు, ప్రెస్బిటేరియన్ వారైన మీరు! మెథడిస్టులైన మీరు వెస్లీని జ్ఞాపకము చేసుకోవచ్చు. బ్యాప్టిస్టులైన మీరు! మరియు ప్రజల వ్యవహారాల నిమిత్తం జాన్ స్మిత్ ఎంతగా ఏడ్చేవాడంటే చివరికి అతని భార్య అతణ్ణి భోజనపుబల్ల వద్దకు నడిపించాల్సి వచ్చేది, రాత్రంతా ఏడుస్తూ ప్రార్థించడంవలన అతని కళ్ళు ఉబ్బిపోయి మూసుకొనిపోయేవి. విషయం ఏమిటి?

137 జాన్ వెస్లీ ఇలా చెప్పాడు, గొప్ప విషయాలలో ఒకటైన...ఆదిమ మెథడిస్టు తండ్రులలో ఒకరు ఇట్లు చెప్పారని నేను నమ్ముతున్నాను, "మెథడిస్టు సంఘపు కుమార్తెలయొక్క అవమానము ఏమిటంటే, వారు ఎంతగానో లోకసంబంధులుగా

మారడం మొదలుపెట్టారు, వారు తమ వేళ్ళకు ఉంగరాలు ధరించడం మొదలుపెట్టారు." మరి ఇప్పుడు వారు పాట్టి నిక్కర్లు వేసుకుంటుంటే, ఆయన ఏమి అనేవాడో?

138 ఏమి జరిగినది? ఆత్మీయ మతిమరుపు. ఖచ్చితంగా అది అదేయైయున్నది, మీరు ఎక్కడి నుండి వచ్చారో మర్చిపోవడమైయున్నది. ఈ విషయాలన్నిటినీ మీరు పొందుకున్నది దేవుని అనుగ్రహము, మంచితనము మీకు దానిని చేసినందువలనేయై యున్నది.

139 ఇది ఒక వింతైన విషయమని మీరు అనుకుంటున్నారా? అది సరిగ్గా యేసుక్రీస్తు యొక్క ఆత్మతో, ప్రవచనముతో సరిపోతుంది. ప్రకటన గ్రంథము, 3వ అధ్యాయములో, ఇట్లు చెప్పబడినది, "నీవు దరిద్రుడవును, గ్రుడ్డివాడవును, దౌర్భాగ్యుడవును, దిక్కుమాలినవాడవునై యున్నావని యెరుగక, 'నేను ధనవంతుడను, నాకేమియు కొదువలేదు, అని నీవు చెప్పుకొనుచున్నావు,' మరి దానిని ఎరుగకయున్నావు." చూడండి, దానిని ఎరుగకయున్నావు! అదేమైయున్నది? ఆత్మీయ మతిమరుపు. వారు దానిని ఎరుగకయున్నారు.

140 ఇప్పుడు సంఘాలకు డబ్బు ఉన్నది. ఈ ప్రాంతములో, కోట్లకొలది డాలర్ల విలువచేసేది కాకుండా ఉన్నటువంటి సంఘశాఖపరమైన సంఘము, దాదాపు, ఒక్కటైనా లేదు. కోట్ల కొలది డాలర్లు విలువ చేసే భవనాలను, మరియు ఇతరమైనవి నిర్మిస్తున్నారు, మరియు ప్రభువు రాకడ సమీపించిందని ప్రకటిస్తున్నారు. "'ధనవంతుడను,' మరియు ఇట్లు చెప్పినది, 'నాకు ఏమియు కొదువలేదు.'" వారు ఎన్నడూ కలిగియున్నవారికంటే అత్యుత్తమ విద్యావంతులైన బోధకులను కలిగియున్నారు, వారు ముందెన్నడూ ఎరిగియున్న దానికంటే ఎక్కువ వేదపాండిత్యాన్ని ఎరిగియున్నారు. వారికి అతి పెద్ద భవనాలు ఉన్నాయి, పట్టణంలో ఎంపికచేయబడిన అత్యుత్తమమైన ప్రదేశాలు ఉన్నాయి. తాము కోరుకున్నదేనినైనా చేయడానికి వారికి అన్ని హక్కులు ఉన్నాయి. మరియు పిదప వారు ఏమి చేశారు? ఆత్మీయ మతిమరుపును పొందుకొని మరియు ఇశ్రాయేలీయుల వలె, తమకు వీటిని కలుగజేసింది దేవుడేనని మరచిపోయారు.

141 మరియు బైబిలు గ్రంథము ప్రవచించినది, యేసుక్రీస్తు తన దూతను యోహానువద్దకు పంపి మరియు, ఈ చివరి సంఘకాలమునకు ఈ ఆత్మీయ మతిమరుపు ఉంటుందని చెప్పాడు. వారు "దౌర్భాగ్యులైయున్నారు," గుర్తుంచుకోండి. వారు గొప్పవారని వారు అనుకుంటారు. వారు దేనినో కలిగియున్నారని వారు అనుకుంటారు. కానీ వారు "దౌర్భాగ్యులును, దిక్కుమాలినవారును, దరిద్రులును, గ్రుడ్డివారును, దిగంబరులునై యున్నారు, మరియు దానిని ఎరుగకయున్నారు," అని ఆయన చెప్పాడు. మరియు వారికి చెప్పడానికి ఏ మార్గము లేదు.

142 ఇప్పుడు, ఒక పురుషుడు గానీ, లేదా ఒక స్త్రీ గానీ బయట ఇక్కడ వీధిలో అవమానకరమైన స్థితిలో, నగ్నంగా, గ్రుడ్డివారిగా ఉన్నారని అనుకోండి, మరి అటువంటి స్థితిలో ఉండటమనేది ఒక దయనీయమైన పరిస్థితియైయున్నది. కానీ వారు సరైన మానసిక స్థితిని కలిగియుండి, వారు ఎవరన్నది వారు ఎరిగియుంటే, వారు మనుషులని, మరియు వారు వస్త్రములను ధరించవలసియున్నదని వారు ఎరిగియుంటే; మంచిది, మీరు అక్కడ బయటికి వెళ్ళినప్పుడు; మరి వారు—వారు

మనుష్యులైయున్నారు, మానవ జాతితో గుర్తించబడవలసియున్నారు; మరియు బయట అక్కడ, "దౌర్భాగ్యులుగా, దిక్కుమాలినవారిగా, గ్రుడ్డివారిగా, మరియు దిగంబరులుగా ఉన్నారు." మరియు మీరు అతని దగ్గరికి వెళ్ళి, "సహోదరుడా, నీవు దిగంబరుడవైయున్నావు," అని చెప్పారనుకోండి.

143 "ఇప్పుడు, ఇదిగో! నేను డాక్టర్ ఫలానా-మరియు-ఫలానా అయ్యినాను! నీవు నీ పని చూసుకో. నేను నీకు చెప్తున్నా కదా, నేను ఫలానా-మరియు-ఫలానా దానికి చెందియున్నాను. పరిశుద్ధ గుండ్రాయి, నాకు ఏది చెప్పడానికైనా, అసలు నీకు అవసరమే లేదు!" [టేపులో ఖాళీ ఉన్నది——సంపా.]

144 "ఒక మనిషి దీనిని చేయడం తప్పు, మరియు ప్రజలు తాము ఇప్పుడు చేస్తున్న కార్యములు చేయడం తప్పు," అని వారితో చెప్పండి.

145 మరప్పుడు వారు తమ బోధకుడు చాలా విశాలమైన-మనస్సు గలవాడని మీకు తెలియజేస్తారు. చూశారా? అది ఏమిటి? అది, వారు ప్రభువైన యేసు యొక్క ఆజ్ఞలను మర్చిపోవడమైయున్నది. పిదప ఆయనను క్రిందకు దిగివచ్చి మరియు ఆయన చేస్తానని చెప్పిన సూచక క్రియలను మరియు అద్భుతాలను చేయనీయండి, మరైనను వారు దానిని నమ్మగోరరు. అది ఆత్మీయ మతిమరుపైయున్నది. చూడండి, వారు దానిని మర్చిపోయారు! మరియు వారు దిగంబరులైయుండి, దానిని ఎరుగకయున్నారు, దానిని గ్రహింపకయున్నారు.

146 "కేవలం నేను సంఘానికి చెందియుంటే చాలు, కావలసిందంతా అదే," అని వారు అనుకుంటారు. ఓ, సహోదరుడా, దేవుని దృష్టికి అది ఎలా ఉంటుందంటే, ఒక ఫ్రీమేసన్ సభ్యుడిగానో లేదా మరి దేనిలాగానో మారినట్లే ఉంటుంది, ఏ ఇతర లాడ్జీలో చేరినట్లే ఉంటుంది. ఒక సంఘానికి చెందియుండటమనేది, అది దేవునికి అసలు లెక్కలోకే రాదు.

147 మీరు దేవుని కుమారులు మరియు కుమార్తెలుగా ఉండవలసియున్నారు. మీరు తప్పక దేవుని మూలముగా జన్మించవలసియున్నారు, మరియు దేవుడు వాక్యమైయున్నాడు. నేను నా తండ్రిలో భాగమైనప్పుడు, నేను నా తండ్రికి సంబంధించిన సమస్తమైయుంటాను. అలాగే మీరు దేవునిలో భాగమైనప్పుడు, మీరు సంపూర్ణంగా, దేవునిగా మారతారు. ఆయనయొక్క సంపూర్ణ వాక్యము, మీరు దానంతటినీ నమ్ముతారు.

ఆత్మీయ మతిమరుపు!

148 మీ పేరు ఏమిటో మీకే తెలియకపోతే ఎలాగుంటుంది? మరియు మీరు, మీరొక మంచి కుటుంబానికి చెందియున్నట్లైతే, మరి మీరు అలాగే చెందియున్నారని నేను ఆశిస్తున్నాను, మీరు ఒక చక్కని ప్రజలుగల కుటుంబమునుండి వచ్చినవారైయుండి, మరి ఆ కుటుంబము యొక్క పేరును మీరు మర్చిపోయి, మరియు మీరు ఇక్కడ బయటికి వెళ్ళి, అవమానకరంగా జీవిస్తున్నట్లైతే పరిస్థితి ఏమిటి? "నీ పేరు జోన్స్ కదా," అని వారంటారు లేదా అది ఏదైతే అది. "మంచిది, నేను ఎవరినో నాకు తెలియదు." చూశారా? అది సరియే, చూడండి, అది ఒక భయంకరమైన స్థితియైయున్నది, అలాంటి పరిస్థితిలోకి వెళ్ళడం ఎంతో ఘోరం.

149 మంచిది, సంఘము సరిగ్గా అలాంటి స్థితికే వచ్చినది. అసలు అది యేసుక్రీస్తుకు ప్రాతినిధ్యం వహించేదిగా ఉండవలసియున్నది. కానీ అది దానిని మర్చిపోయినది, ఎందుకంటే, వాక్యమునకు బదులుగా వారు స్వీకరించినట్టి, మతాచారములు మరియు సంఘశాఖలు, దానిలోకి జొప్పించబడ్డాయి. "మరియు వారు దిగంబరులును, గ్రుడ్డివారును, దౌర్భాగ్యులునైయుండి, మరియు దానిని ఎరుగకయున్నారు", మరియు వారికి చెప్పడానికి ఏ మార్గము లేదు.

150 నేను మరలా బర్మింగ్‌హామ్ కి ఎన్నడూ రాకపోవచ్చును, అయితే వారు ఈసారి మాత్రము దీనిని వినబోతున్నారు. చూశారా? చూశారా? నిజము. నేను కేవలం...నేను విత్తనమును విత్తడం తప్ప మరిదేనికి బాధ్యుడను కాను. అది పడవలసిన నేలకు దానిని దేవుడే నిర్దేశిస్తాడు.

151 మర్చిపోయారు, అవును, వారు వాగ్దాన వాక్యమును మర్చిపోయారు. వారు మర్చిపోయారు. యేసు వచ్చినప్పుడు ఇశ్రాయేలు ఆ విధమైన పరిస్థితిలో ఉన్నది. అది మర్చిపోయినది. వారు ఎదురుచూశారు, ఓ, రానున్న మెస్సీయ్య ఉన్నాడని వారు నమ్మారని వారు చెప్పారు. కానీ ఆ మెస్సీయా వచ్చి మరియు వాక్యము ద్వారా తననుతాను గుర్తింపజేసుకున్నప్పుడు, వారు ఎన్నో మతాచారములను కలిగియున్నారు ఎంతగా అంటే వారు దేవుని వాక్యమును నిరర్థకము చేశారు.

152 మరియు సరిగ్గా అంత్యకాలమునకు ముందు, "సొదొమలో జరిగినట్లుగా, అది జరుగుతుంది," అని యేసు చెప్పాడు. మరియు అది గుర్తింపజేయబడినది, మరియు ప్రజలు ఎంత ఆచారబద్ధమైయున్నారంటే వారు తమ ఆచారము ద్వారా, దేవుని వాగ్దానమును నిరర్థకము చేశారు. ఆత్మీయ మతిమరుపు! అది సరిగ్గా ఆత్మీయ మతిమరుపే అయ్యున్నది. చూడండి, వారు ఈ సంగతులను మర్చిపోయారు.

153 "ఓ, నేను *దీనికి* చెందియున్నాను. నేను——నేను *దీనిని* చేశాను. నేను ఆత్మలో నాట్యము చేశాను. నేను *దీనిని* చేశాను." మంచిది, మై, మై, దానితో ఎటువంటి సంబంధమూ లేదు, అస్సలు లేదు.

154 మీరు ఒక క్రైస్తవుడ్డెయుండి వాక్యమును ఎలా నిరాకరించగలరు? మీరు దానిని చేయలేరు. దేవుడు వాక్యమైయున్నాడు. వాక్యము మీలో ఉన్నట్లైతే, మీరు మరియు వాక్యము ఒక్కటైయున్నారు. వాక్యము ఏమైయున్నదో, అదంతా మీరు అయ్యున్నారు. ఆమేన్. నేను ఈ తరములో జీవిస్తున్నట్లైతే, ఈ తరమునకు ఈ వాక్యభాగము ఏమని వాగ్దానము చేసినదో, నేను తప్పక అది అయ్యుండవలసియున్నాను. నేను ఒక క్రైస్తవుడనై యుండబోతున్నట్లైతే, బైబిలు దేనిని ప్రకటించి మరియు దేని కోసం నిలబడుతుందో దానంతటితో నేను గుర్తించబడవలసియున్నాను.

155 హల్లెలూయా! ఎలాగైనా, నన్ను పరిశుద్ధ గుండ్రాయి అంటారు, మరియు సరిగ్గా ఇప్పుడు నాకు చాలా భక్తిపారవశ్యముగా అనిపిస్తున్నది. అవును, అయ్యా.

156 బైబిలు ప్రకటించే ప్రతిదానితో నేను గుర్తించబడవలసియున్నాను. మరియు అది దాని ప్రకటనలను ఇస్తుంది, మరియు, నేను గనుక ఈ ఆధునిక-దినపు ఆత్మీయ మతిమరుపుతో కొట్టబడకపోతే, నేను దానితో గుర్తించబడతాను మరియు దానితో గుర్తించబడటం సాధ్యపడుతుంది కూడా. నేను గనుక దానిని

నిరాకరిస్తే, అప్పుడు నాకు ఆత్మీయ మతిమరుపు ఉన్నట్లే; ఏదో జరిగినది, నేను ఒక మతాచారమును లేదా ఒక సిద్ధాంతమును స్వీకరించాను, లేదా ఏదో ఒక సంఘమును లేదా ఒక మనుష్యుల గుంపును స్వీకరించాను. వాక్యము వచ్చి మరియు దానినది గుర్తింపజేసుకున్నప్పుడు కూడా, "నేను దానిని చేయలేను అంటారు."

157 అందుచేతనే యేసు గుర్తించబడలేదు. "ఓ," వారు ఇట్లంటారు, "మంచిది, ఈ వ్యక్తి పరిశుద్ధుడు, ఈ, మా పరిశుద్ధ యాజకుడు, మా పరిశుద్ధుడైన ఈ వ్యక్తి."

158 మరియు యేసు ఇట్లు చెప్పాడు, "మీరు మీ తండ్రియైన, అపవాది సంబంధులు, మరియు మీరు వాని క్రియలనే చేయుదురు."

159 కయీను కూడా, ఒక మంచి బల్యర్పణను అర్పించాడని మీకు తెలుసా? అతడు యథార్థముగా ఉన్నాడు, ఒక బలిపీఠమును నిర్మించాడు, మోకరించి ఆరాధించాడు, మరియు ఒక బల్యర్పణను అర్పించాడు, మరియు దేవునికి ప్రార్థించాడు. మరియు ఒకవేళ, దేవుడు, దేవుడు కోరేదంతా అది మాత్రమేయైతే, మీరు ఒక సంఘానికి చెందియుండాలని మరియు ఒక బలిపీఠమును కలిగియుండాలని, మరియు మీ దశమభాగములను చెల్లించాలని మరియు సంఘమునకు వెళ్ళాలని, మరియు ఒక మంచి జీవితమును జీవించాలని మాత్రమేయైతే; ఆయన కోరేదంతా అది మాత్రమేయైతే, కయీనును ఖండించడంలో ఆయన అన్యాయస్థుడైనట్టే, ఎందుకంటే అతడు కూడా దానినే చేశాడు. అవును, అయ్యా. అది ఖచ్చితంగా వాస్తవము.

160 అయితే మతము అంటే "ఒక కప్పుకునేది" అని అర్థము, మరియు మీరు మీ స్వంత సత్క్రియల ద్వారా కప్పబడటం అనేది సాధ్యపడదు. దేవుడు అంగీకరించేది ఒకేఒక్కటి ఉన్నది, మరియు అది యేసుక్రీస్తు యొక్క రక్తమైయున్నది. కప్పేది అది మాత్రమేయైయున్నది. దానికి వెలుపల, "మతాచారమును పాటించడం" అని మీరు అన్నారంటే, అది ఆత్మీయ మతిమరుపే! జరిగినది అదేయైయున్నది.

161 ఇప్పుడు గమనించండి, వారు తమ వాక్యమును మర్చిపోయారు. వారు బైబిలును మర్చిపోయారు. వారు వాగ్దానమును మర్చిపోయారు. వారు మెథడిస్టు ఏమైయున్నదో, బ్యాప్టిస్టు ఏమైయున్నదో, ఇంకెవరు ఏమైయున్నారో ఆ గతకాలముయొక్క ప్రతిబింబపు వెలుగులో జీవించడానికి ప్రయత్నిస్తూ ఉన్నారు. ఇదిగో ఈ దినముయొక్క వాగ్దానము ఇక్కడున్నది, మరియు దేవుడు ఆయనయొక్క వాక్యము ద్వారా దానిని మాట్లాడుతూ ఉన్నాడు, మరియు అది ఆ విధంగా ఉన్నదని మరలా నిర్ధారిస్తూ మరియు ఋజువుచేస్తున్నాడు, మరి అయినను వారు దానిని నమ్మరు. ఆత్మీయ మతిమరుపు! అది ఖచ్చితంగా నిజము. పూర్తిగా, పూర్తిగా మతిమరుపుతో నిండినవారు, దానిని అస్సలు నమ్మనే నమ్మరు.

162 ఒక ఫ్రెంచ్ సైనికుడు. నాకు ఒక చిన్న కథ చెప్పబడినది; మనం ముగించుకునే ముందు దానిని చెప్తున్నాను. అసలు ఇంత ఆలస్యమైందని కూడా నాకు తెలియలేదు, మరి నా దగ్గర ఇక్కడ దాదాపు పది పేజీల నోట్సు మిగిలియున్నది; దానిని ఇంకెప్పుడైనా చెప్పుకుందాము. గమనించండి, ఒక ఫ్రెంచ్ సైనికుడు. సైన్యములోనుండి వారు ఒక గుంపు సైనికులను తీసుకువచ్చారు, మరియు వారికి ఈ మతిమరుపు వచ్చినది. అది వారు పోరాటములో దిగ్భ్రాంతి చెందడంవలన

కలిగినది. మరియు వారు ఒక కార్యక్రమమును నిర్వహించారు, మరియు వారు—వారు ఫోన్లు చేసి మరియు ఎవరైతే తమ ప్రియులను తప్పిపోయారో అట్టి ప్రజలు వచ్చి ఈ అబ్బాయిలను గుర్తుపట్టగలరేమో చూడమని చెప్పారు. వీరికి ఎటువంటి ఆశ మిగలలేదు, వారిలో, బహుశా ఒక్కరు లేదా ఇద్దరు, గుర్తించబడ్డారు. మరియు పిదప ఆ మిగతావారిని వారు తీసుకెళ్ళి, వారిని ఒక ఆరోగ్య నిలయములో ఉంచబోతున్నారు, మరి వారు తమ మిగతా జీతమంతా అక్కడే ఉండవలసియున్నారు.

163 వారు కొండప్రాంతము ప్రక్కగా వెళ్తున్నారు, రైలుబండి ముందుకు సాగుతూ ఉన్నది; మరియు వారు ఒక స్టేషన్ దగ్గర ఆగినారు, ఆ అబ్బాయిలు బయటకు వెళ్ళి కాళ్ళు జాడించుకొని ఉపశమనం పొందడానికి వారు అనుమతించారు. మరియు వారిని గమనించడానికి, కాపలాదారులు ఆ కొండ పైకి ఎక్కినారు, ఎందుకంటే మతిమరుపు ఉండటంవలన, ఇంకేంటీ, వారు—వారు వారిని గమనించవలసియున్నది.

164 కాబట్టి వారు అక్కడ ఒక యవ్వనస్తుడిని గమనించారు, అతడు బయటకు వెళ్ళి మరియు ఆ నీళ్ళ ట్యాంకు చుట్టూ చూడటం మొదలుపెట్టాడు, ఆ కొండమీదుగా చుట్టూ చూశాడు. అతడు తన ముఖమును రుద్దుకొని, మరియు అతడు గమనించాడు. మరియు అతడు మరలా చూశాడు, మరియు అతడు ఆ నీళ్ళ ట్యాంకును చూశాడు. అతడు ఆ స్టేషన్ చుట్టూ అంతటా చూసి, మరియు అతడు నడవడం మొదలుపెట్టాడు. మరి ఆ కాపలాదారుడు అతణ్ణి ఆపడానికి బదులు, అతణ్ణి వెంబడించాడు.

165 అతడు ఆ కొండ మీదుగా వెళ్ళి, ఒక చిన్న దారిలో వెళ్ళి, కుడివైపుకు తిరిగి మరియు మరొక చిన్న కొండమీదుగా వెళ్ళి, మరియు మొద్దులతో కట్టబడిన ఒక చిన్న ఇంటి దగ్గరికి వచ్చాడు. అతడు చూశాడు. ఒక వృద్ధుడు తన చేతిలో కర్రను పట్టుకొని, బయట వాకిట్లోకి వచ్చాడు, బయటకు వచ్చి అతడిని కౌగలించుకున్నాడు. "నా కుమారుడా, నీవు తిరిగి వస్తావని నాకు తెలుసు. నీవు మరణించావని వారు నాకు చెప్పారు, కానీ నీవు తిరిగివస్తావని నాకు తెలుసు," అని అన్నాడు. మరియు ఆ అబ్బాయి స్పృహలోకి వచ్చాడు. అతని మతిమరుపు అతడిని విడిచిపెట్టినది. అతడు ఎవరన్నది అతడు గుర్తించుకోగలిగాడు. అది అతని తండ్రేయని అతనికి తెలిసినది.

166 ఓ, సిలువ సైనికుడా, ఎంతో తర్ఫీదుతో దిగ్భ్రాంతికి గురిచేయబడినవాడా, ఎన్నో సంఘశాఖలు మరియు మతాచారములు, మరియు లోకముయొక్క సంగతులచేత దిగ్భ్రాంతులకు గురియైనవాడా, నీవు కొన్ని నిమిషములు బయటకు వచ్చి మరియు బైబిలును చూడటం ఎందుకని మొదలుపెట్టకూడదు? బహుశా అలా వెళ్తూ వెళ్తూ, మరియు ఈ దినములలో ఏదో ఒక రోజు, స్వయంగా నీవు ఇక్కడ వాక్యములో, ఒక విశ్వాసిగా గుర్తించబడటాన్ని నీవు కనుగొంటావేమో. నీకు ఆయన తెలియకపోవచ్చును. అయితే ఆ తప్పిపోయిన కుమారుని వలె, నీవు మతిస్థిమితములోకి వచ్చి, నిన్ను నీవు కనుగొనవచ్చును. నీవు దేవునియొక్క వాక్యములలో నీ గుర్తింపును కనుగొనవచ్చును.

167 ఈ మధ్యనే, ఒక రోజు, ఒకరు ఇట్లు చెప్పారు, ఇట్లున్నారు, "కానీ, సహోదరుడా బ్రెన్హామ్, పెంతెకొస్తు ప్రజలైన మమ్మల్ని చూడండి, మేము ఎంత చక్కని

సంఘాలను కలిగియున్నామో చూడండి. అంతెందుకు, మేము, మేము తర్కీదు పొందిన సేవకులను కలిగియున్నాము."

168 వినండి, ఒక పురుషుడు ఒక భార్యను పెండ్లి చేసుకున్నప్పుడు, అతడు ఆమె అందముపై నమ్మికయుంచడు. లేదు. ఆమె చేసిన ప్రమాణము పట్ల, ఆమెయొక్క మాట పట్ల ఆమె ఎంత విశ్వసనీయంగా ఉంటుందో దానిపై అతడు నమ్మికయుంచుతాడు. అతడు ఆమె అందమును నమ్మడు. అతడు ఆమెయొక్క విశ్వసనీయతలో నమ్మికయుంచుతాడు.

169 మరియు మీరు దేవునికి వివాహము గావించబడినప్పుడు కూడా అది ఆ విధంగానే ఉంటుంది, మీరు నిర్మించగల ఏదో ఒక పెద్ద సంఘములో మీరు నమ్మకముంచరు, కానీ "నేను నిన్నా, నేడు, మరియు నిరంతరము ఒక్కటేరీతిగా ఉన్నాను," అని, యేసుక్రీస్తు చేసిన వాగ్దానములో మీరు నమ్మకముంచుతారు. మీరు దానిని నమ్ముతున్నారా?

మనము ఒక్క క్షణం మన తలను వంచుకుందాము.

170 ఈ రాత్రి, నేను ఆశ్చర్యపోతున్నాను, ఇక్కడ ప్రజలు కూర్చొనియున్న ఈ భవనములో, నిత్యులు, నిత్యత్వమునకు-బద్దులైయున్న స్త్రీ పురుషులు ఉన్నారు, మరియు మీరు ఏదో ఒక రోజు దేవుడిని కలుసుకోవలసియున్నారని మీకు తెలుసు. మరియు నేను ఇట్లు ఆశ్చర్యపోతున్నాను, మీరు ఆ మతిమరుపును ఒక శ్వాసంతైనా కలిగియున్నట్లైతే మరియు మీరు...మరియు మీరు తప్పుడు కార్యములో గుర్తించబడియుంటే, మీరు ఈ రాత్రి, కొద్దిగా అలా తిరుగుతూ వెళ్ళి మరియు మీరు క్రీస్తుయేసులో గుర్తించబడలేరా అనే విషయాన్ని తెలుసుకొనగోరుతున్నారా? మీరు మీ చెయ్యిని పైకెత్తి, "సహోదరుడా బ్రెన్హామ్, నా కొరకు ప్రార్థించు, నేను ఒక నిజమైన క్రైస్తవుడిగా, ఒక నిజమైన క్రైస్తవునిగా గుర్తించబడాలని కోరుతున్నాను," అని చెప్తారా. దేవుడు నిన్ను దీవించును గాక. దేవుడు నిన్ను దీవించును గాక. నిన్ను దీవించును గాక! ఓ, అవును, అంతటా ఉన్నారు. ప్రభువైన దేవుడు మిమ్మల్ని దీవించును గాక.

171 పైన బాల్కనీలో ఎవరైనా, "సహోదరుడా, అది సత్యమని నేను నిజంగా నమ్ముతున్నాను. కొన్ని సంవత్సరాల క్రితం క్రైస్తవులు ఎలా ఉండేవారు, క్రైస్తవులుగా మనం అలా లేమని నేను నమ్ముతున్నాను," అని చెప్తారా.

172 పెంతెకొస్తు ప్రజలైన మీ సంగతి ఏమిటి, మీ తల్లిదండ్రులు బయట ఇక్కడ వీధిలో నిలబడి, మరియు ఒక పాత ఖంజెరను వాయిస్తూ ఉండేవారు. మరియు మీ తల్లి, ఆమె ఏ విధంగా...ఆమె అలసిపోయి, చిన్న పిల్లలైన మీతో ఇబ్బందిపడేది. కొన్నిసార్లు మీరు బట్టలు లేకుండా, మరియు మిగతావన్నీ లేకుండా ఉండాల్సి వచ్చేది, కానీ మీ అమ్మా నాన్న క్రీస్తును ఎత్తిపట్టియుంచుటకు, ఆ కారణమునకు విశ్వాసనీయముగా ఉన్నారు.

173 పెంతెకొస్తు ప్రజలైన మీరు ఏమి చేశారో చూడండి. యాభై సంవత్సరాల క్రితం, మీరు ఆ సంఘసంస్థ నుండి బయటకు వచ్చారు. మిమ్మల్ని పెంతెకొస్తుగా చేసేది అదేయైయున్నది, మీరు అవిశ్వాసి నుండి మిమ్మల్ని మీరు వేరుచేసుకున్నారు. "మరియు ఒక పంది తన గుంటకు మరలినట్లు, మరియు ఒక కుక్క తన వాంతికి మరలినట్లు," మీరు నేరుగా వెనుకకు వెళ్ళి మరియు అదే కార్యమును

చేశారు, మీరు దేనిలోనుండైతే బయటకు వచ్చారో సరిగ్గా అదే రకమైన గందరగోళమును సృష్టించారు. విషయమేమిటి? ప్రజల మధ్య ఆత్మీయ మతిమరుపు సోకినది. ఇప్పుడు మీరు మీ మతాచారములను మరియు మీ సంఘశాఖ సంబంధమైన పత్రాలను కలిగియున్నారు, మరియు మీరు సరిగ్గా ఆ మిగతావారితో సమానముగా ఉన్నారు, ఆ మిగతావారితో ఉండగోరినారు. మీరు మీ స్త్రీలకు తమ తలవెంట్రుకలను కత్తిరించుకోడానికి అనుమతించారు, రంగులు పూసుకోడానికి అనుమతించారు. మీరు, వారు ఈ సంగతులన్నిటినీ చేయడానికి మీరు వారికి అనుమతిస్తున్నారు, సంఘములలో ఇటువంటి వాటన్నిటినీ అనుమతిస్తున్నారు. అది ఏమిటి? ఆత్మీయ మతిమరుపు.

174 పిదప, మొదటి విషయమేమిటో మీకు తెలుసా, దేవుడు ప్రజలను దర్శించడం మొదలుపెట్టినప్పుడు, అప్పుడు ఏమి జరుగుతుంది? మీరు దానిని స్వీకరించలేరు. చూడండి, మీరు ఆ మతిమరుపుతో ఎంత తీవ్రంగా ప్రభావితం చెందారంటే, చూడండి, మీరు ఆ ఒక్క విషయాన్నే వింటూ వచ్చారు. కేవలం కొన్ని నిమిషాలు మీరు ఆ మతసిద్ధాంతము నుండి బయటకు వచ్చి మరియు బైబిలును తీసుకొని, మరియు ఒక క్రైస్తవుడు ఏ విధంగా గుర్తించబడవలసియున్నాడో చూడవలసియున్నారని మీరు అనుకోవడంలేదా? "నమ్మినవారిని ఈ సూచకక్రియలు వెంబడించును!"

175 అపొస్తలుల కార్యములలో, పేతురు ఇట్లన్నాడు, "పశ్చాత్తాపపడి, పాపక్షమాపణ నిమిత్తము, మీలో ప్రతివాడును యేసుక్రీస్తు నామములో బాప్తిస్మము పొందుడి, మరియు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందెదరు; ఏలయనగా వాగ్దానము మీకును, మీ పిల్లలకును, మరియు దూరస్థులందరికీ, అనగా ప్రభువైన మన దేవుడు పిలచువారందరికీ చెందును." అది ఆ విధంగా కాదని వారు మీకు చెప్తున్నట్లైతే, అప్పుడు మీ సంఘకాపరి గారు ఎంతో తీవ్రమైన ఆత్మీయ మతిమరుపును కలిగియున్నారు. అతడు తననుతాను ఆ సంఘముతో గుర్తించబడుతున్నట్లు కనుగొనలేకపోతున్నాడు; ఒక సంఘసంస్థ కాదు; ఒక సంఘము, క్రీస్తుయొక్క మర్మయుక్తమైన శరీరము.

176 ఇప్పుడు పరిశుద్ధాత్మ ఇక్కడున్నాడు. సరిగ్గా తాను వాగ్దానము చేసినదానిని జరిగించడానికి ఆయన ఇక్కడ ఉన్నాడు. ఇప్పుడు మీ తలలు వంచుకొని మీరు ఇక్కడ ఉండగా, కేవలం ప్రార్థిస్తూనే ఉండండి. పరిశుద్ధాత్మ, తానే మాట్లాడటానికి అనుమతించండి. మరియు ఒకవేళ ఇది---ఈ దినము కొరకైన వాగ్దానము, అది ఏమిటో, ఎవరికైనా తెలుసు. ఇప్పుడు అవసరతలో ఉన్న మీరు, ఈ రాత్రి, మీరు, మీలో అనేకులు మీ చేతులను పైకెత్తారు. మీరు దానిని చేయడానికి ముందు---

177 నేను ఇట్లు ఆశ్చర్యపోతున్నాను, మనము ఇక్కడ ఉండి మరియు నిజంగా రోగుల కొరకు ప్రార్థిస్తుండగా, ఆ అవిశ్వాసము నుండి, ఆ సంఘశాఖనుండి, ఈ కార్యములు ఆలాగున కాదు అని చెప్పే ఆ మతాచారమునుండి, అది దయ్యపు సంబంధమైనది అని చెప్పేదాని నుండి మీరు దూరమవ్వగలరా అని నేను ఆశ్చర్యపోతున్నాను. వారు ఆ విధంగా చెప్పినప్పుడు, "వారు ఈ యుగమందైనను రాబోవు యుగమందైనను, ఎన్నడూ క్షమించబడరు." ఇది సత్యమైనట్లైతే పరిస్థితి ఏమిటి? ఒక్కసారి ఆలోచించండి, ఇది సత్యమేయైతే పరిస్థితి ఏమిటి, అప్పుడు మీరు ఎక్కడున్నట్లు? చూడండి, మీరు దానిని బయటకు పలుకవలసిన

అవసరంలేదు; కేవలం మీ హృదయములో దానిని నమ్మండి. మరియు దానిని నమ్మే ప్రజలు ఇక్కడ ఉన్నారు. గడచిన రెండు రాత్రులు నేను సరిగ్గా ఇక్కడే కూర్చొని, ఏదో ఒక ఒత్తిడి క్రింద పనిచేస్తూ, నన్ను నేను అదుపులో పెట్టుకుంటూ, దానిని ఎత్తిచూపకుండా ఉండటానికి నా నాలుకను కరచుకొనియున్నాను.

178 మరియు స్నేహితుడా, గుర్తుంచుకో, అది నీకు మరియు దేవునికి మధ్య ఉన్నది. అది తప్పెయ్యుండి, నీవు ఆ విధంగా అనుకుంటున్నట్లైతే ఏమిటి? ఏమి జరుగుతుందో నీకు తెలుసా, దానినిబట్టి నీవు ఎన్నడూ క్షమించబడవు. ఆత్మీయ మతిమరుపు, నీవు నేరుగా నీ నిత్యమరణములోకి, అవిశ్వాసములోకి వెళ్ళిపోతావు. "విశ్వసింపనివానికి ఇదివరకే తీర్పుతీర్చబడెను!"

179 ఇప్పుడు మీ అనారోగ్యము కొరకు ప్రార్థించండి, ఇట్లు చెప్పండి, "ప్రభువైన యేసూ, నీవు వాగ్దానము చేశావు. నేను..."

బహుశా ముందెన్నడూ ఇక్కడికి రానట్టి, కొందరు క్రొత్తవారు ఇక్కడ ఉండవచ్చును.

180 నేను ఒక్క లేఖనమును తీసుకుంటాను, "లోతు దినములలో జరిగినట్లే," అని యేసు వాగ్దానము చేశాడు, "ఆ ప్రకారమే జరుగును," అప్పుడు దేవుడు ఒక మాంసపు శరీరములో ప్రత్యక్షపరచబడినాడు; మరియు ఆ ప్రజలు, అబ్రాహాము, ఆ ఎన్నుకోబడిన గుంపు, ఆ బయటకు-పిలువబడిన గుంపు అక్కడున్నది. మరియు అబ్రాము పేరు అబ్రాహాముగా మార్చబడినది, పిదప అతడు వాక్యము శరీరధారియగుటను చూశాడు, మరియు అది శారా హృదయములోని తలంపులను వివేచించినది.

181 మరియు అబ్రాహాముయొక్క రాజ సంతానము వచ్చినప్పుడు, ఆయన చేసినది అదేయైయున్నది, మరియు వారు ఆయనను "ఒక దయ్యము" అని పిలిచారు.

182 ఆయన ఇట్లన్నాడు, "పరిశుద్ధాత్మ వచ్చినప్పుడు, ఆయన అదే కార్యమును చేస్తాడు." ఇట్లన్నాడు, "ఇప్పుడు మీరు నన్ను ఆ పేరుతో పిలిచినప్పుడు మీకు క్షమాపణ ఉంది, కానీ, మీరు పరిశుద్ధాత్మకు వ్యతిరేకముగా మాట్లాడినప్పుడు, ఎటువంటి క్షమాపణ లేదు."

183 మీరెక్కడున్నా గానీ, ఆయనయొక్క ఆత్మీయ వివేచనతో, ఆయన వాక్యమైయున్నాడని చూపిస్తూ, ఇప్పుడు ఆయన తన శక్తిలో, ఈ జన సమూహములోకి వచ్చునుగాక. తద్వారా ఇక్కడ ఎవరైనా ఆత్మీయ మతిమరుపుతో ఉన్నట్లైతే, వారు...ఈ బలిపీఠపు పిలుపును ఇవ్వకముందే, వారు ఎటువంటి సాకు లేకుండా ఉందురుగాక.

184 ప్రభువైన దేవుడు సహాయము చేయును గాక. ఇప్పుడు మీ తలలు వంచియుండగా, భక్తిమర్యాదలతో ప్రార్థిస్తూ ఉండండి.

185 చూడండి, ఇక్కడ నా ముందు ఒక స్త్రీ కూర్చొనియున్నది. ఆమె తన చేతులను తన ముఖము దగ్గర పెట్టుకొనియున్నది. ఆమె వెన్నెముకకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నది. మరియు ఆమెకు నరాల ఉద్రిక్తత కూడా ఉన్నది. ఆమె కడుపు జబ్బును కలిగియున్నది. మరియు ఇప్పుడు ఆమె నా ముందు కూర్చొనియున్నది. మరియు ఆమెకు తెలిసియుండవచ్చును, ఆమె ఈ ప్రాంతానికి

చెందినది కాదు. ఆమె మేకాన్ అనబడే నగరానికి చెందినది. అవును. నీవు ఎవరివో దేవుడు నాకు చెప్పగలడని నీవు నమ్ముతున్నావా? నీవు శ్రీమతి ఏయర్స్. అది నిజమే అయితే, నీ చెయ్యి పైకెత్తు. నేను నీకు అపరిచితుడను. అది నిజము, అది నిజమే కదా? ఇప్పుడు నీ సమస్య తీరిపోయినది. యేసుక్రీస్తు; నీవు ఆయన వస్త్రమును ముట్టుకున్నావు. ఆయన నిన్ను స్వస్థపరచాడు. ఇప్పుడు కేవలం దానిని నమ్ము.

186 భవనంలో ఆ వెనుక ఒక వ్యక్తి కూర్చొనియున్నాడు. అతడు పరిశుద్ధాత్మ బాప్తిస్మము కొరకు ఎదురుచూస్తున్నాడు. అతడు ఆత్మ బాప్తిస్మమును కోరుచున్నాడు. అతడు ఇక్కడ నా ముందు నిలబడియున్నాడు. అతను కూడా, ఇక్కడివాడు కాడు. అతడు కరోలినా, చార్లెట్ కు చెందినవాడు. అతని పేరు లీపో. నీ హృదయమంతటితో నమ్ము, మరియు నా——నా సహోదరుడా, నీవు దానిని నమ్మినట్లైతే, దేవుడు నిన్ను పరిశుద్ధాత్మతో నింపుతాడు.

187 ఇక్కడ, నా కుడివైపున, ఇక్కడ ఒక——ఒక పురుషుడు మరియు అతని భార్య తిన్నగా ఇక్కడ నాముందు కూర్చొనియున్నారు. వారు వృద్ధ దంపతులైయున్నారు, నా కుడివైపున ఉన్నారు. ఆ స్త్రీ పెద్ద ప్రేగుకు సంబంధించిన వ్యాధితో బాధపడుచున్నది. ఆమె భర్తకు గుండె జబ్బు ఉన్నది. వారు ఇక్కడివారు కాదు. వారు టెన్నెస్సీ నుండి వచ్చారు. శ్రీ మరియు శ్రీమతి. థామస్, మీరు మీ హృదయమంతటితో నమ్మినట్లైతే, మీ చేతులను పైకెత్తండి మరియు మీరు మీ స్వస్థతను అంగీకరించవచ్చును. యేసుక్రీస్తు మిమ్మల్ని బాగుచేస్తాడు. సరిగ్గా ఆయన చేస్తానని వాగ్దానము చేసినది అదేయైయున్నది. అయితే నా జీవితములో వారిని నేను ఎన్నడూ చూడలేదు.

ఆత్మీయ మతిమరుపు!

188 యేసు ఇట్లు చెప్పాడు, "నేను చేయు క్రియలు మీరును చేతురు. కొంతకాలమైన తర్వాత, లోకము నన్ను మరి ఎన్నడును చూడదు; అయినను మీరు నన్ను చూతురు, ఏలయనగా నేను," వ్యక్తిగత సర్వనామము, "మీతోను, మీలోను, యుగసమాప్తివరకు ఉందును." "యేసుక్రీస్తు నిన్నా, నేడు, మరియు నిరంతరము ఒక్కటేరీతిగా ఉన్నాడు."

189 ఇప్పుడు, ఇక్కడ, మీలో ఏదో సమస్యను కలిగియున్న స్త్రీ పురుషులు, అసలు ఇది ఎలాగన్నది చూడలేకపోతున్న మీరు...మీరు, మీరు నమ్మాలనుకుంటున్నారు, కానీ మీరు అసలు దానిలోకి రాలేకపోతున్నారు, మరియు మీరు ప్రార్థన చేపించుకోవాలని అనుకుంటున్నారు, మీరు ఆయన సన్నిధిలో ఉన్నప్పుడే మీరు ఆయనను అంగీకరించగోరుతున్నారు, అటువంటివారు వచ్చి మరియు ఇప్పుడు సరిగ్గా ఇక్కడ నా ప్రక్కన నిలబడతారా, నన్ను ప్రార్థించనివ్వండి మరియు మీ మీద చేతులుంచనీయండి. ఇప్పుడు మీరు నేరుగా పైన ఇక్కడికి రండి, ఆ విధంగా, ఆత్మీయ మతిమరుపుతో బాధపడుతూ, మరియు మీరు దానినుండి విడుదల పొందునట్లు, ప్రార్థన చేపించుకోవాలని కోరుతున్న మీరు రండి. మీరు ఒక——ఒక విశ్వాసి కాకున్నా గానీ, మీరు ప్రార్థించబడాలని కోరుచున్నయెడల, ఇక్కడికి వచ్చి మరియు నిలబడండి. యవ్వనస్థుడా, దేవుడు నిన్ను దీవించును గాక. ఇంకెవరైనా వస్తారా? అమ్మా, దేవుడు నిన్ను దీవించును గాక. రమ్ము. యౌవ్వనస్థురాలా, దేవుడు నిన్ను

దీవించును గాక. ఇంకెవరైనా వస్తారా? సరిగ్గా ఇప్పుడే, రండి, నేరుగా ఇక్కడ నిలబడండి.

190 అత్మీయ మతిమరుపు, నేను దానితో పీడింపబడాలని కోరుకోవడం లేదు. దేవుడు అట్లు జరుగనివ్వకుండును గాక. ఎటువంటి మరణము చేతనైనా నన్ను చనిపోనిమ్ము, కానీ ఒక అవిశ్వాసిగా నన్ను ఎన్నడూ చనిపోనియకుము.

191 రండి, ఇప్పుడే ఆయనను స్వీకరించండి. మీరు అలా చేయరా? రండి, స్నేహితులారా, ఆ బాల్కనీ నుండి క్రిందకు రండి. అది దిగువున ఇక్కడ కేవలం కొన్ని అడుగుల దూరంలో ఉన్నది, మరియు అది మీకు, జీవమరణముల మధ్యనున్నంత వ్యత్యాసముగా ఉండవచ్చును.

192 చూడండి, క్రీస్తుచేత నేను దేనినీ చేపించలేను. క్రీస్తు ఒకేఒక్క కార్యమును తప్ప మరిదేనిని చేయవలసిన అవసరము లేదు: ఆయన తన మాటను నిలబెట్టుకోవలసియున్నాడు. క్రీస్తుగా ఉండుటకు, దేవునిగా ఉండుటకు ఆయన దానిని చేయవలసియున్నాడు. ఆయన తన మాటను నిలబెట్టుకోవలసియున్నాడు.

193 ఇప్పుడు గుర్తుంచుకోండి, మీ అనుభవము విషయములో మీకు నిశ్చయత లేకపోతే, ఇప్పుడు ఎందుకని ఇక్కడికి రాకూడదు. మీరు కేవలం ఒక సంఘశాఖకు చెందియున్నట్లైతే, మీరు ఒక పెంతెకొస్తు మనుమడుయైతే వినండి, దేవునికి ఎటువంటి మొనుమళ్ళు లేరు. ఆయనకు కుమారులు మరియు కుమార్తెలు ఉన్నారు గానీ, మనుమళ్ళు-మనుమరాళ్ళు లేరు. చూశారా? దేవుడు వారిని కలిగిలేడు. ఆయన కేవలం కుమారులను మరియు కుమార్తెలను కలిగియున్నాడు, మరియు మీరు కాదని మీకు తెలుసు.

194 బహుశా మీరు భాషలతో మాట్లాడియుండవచ్చును, మీరు నాట్యము చేసియుండవచ్చును, మీరు ఇదంతా చేసియుండవచ్చును. అది మంచిదే. దానికి వ్యతిరేకంగా నాకేమియు లేదు. మరైనాగాని మీరు ఇంకను ఆ ఆత్మీయ మతిమరుపును కలిగియున్నట్లైతే, క్రిందకు దిగి, ఇక్కడికి వచ్చి మరియు ఇక్కడ నిలబడండి. మనం దాని గురించి ప్రార్థించుదాము. మీరు ఏమంటారు? సంఘ సభ్యుడా, కేవలం ఒక—ఒక నామకార్థ సంఘ సభ్యుడా, నీవెందుకని ఇక్కడికి రాకూడదు మరియు సరిగ్గా ఇప్పుడే మనం దానిని ఎందుకని తొలగించుకోకూడదు?

195 ఏదో ఒక రోజు, తీర్పు వచ్చినప్పుడు, నేను మీ ఎదుట నిలబడవలసియున్నానని ఎరిగియుండి, నేను ఇక్కడ బర్మింగ్‌హామ్ ను ఇలాగే వదిలివెళ్ళాలని అనుకోవడంలేదు...గుర్తుంచుకోండి, నేను మిమ్మల్ని మరలా కలుసుకోబోతున్నాను. నేను ఇక్కడ ఈ స్థలములో మరలా ఎన్నడూ మిమ్మల్ని కలుసుకోకపోతే, నేను తీర్పు వద్ద మిమ్మల్ని కలుసుకోబోతున్నాను మరియు ఈ రాత్రి నేను చెప్పినదానికి నేను జవాబునివ్వవలసియున్నాను.

196 ఇప్పుడు వినండి. స్నేహితులారా, పశ్చాత్తాపపడండి! పశ్చాత్తాపపడండి, దానినుండి బయటకు రండి. అక్కడనుండి బయటకు రండి. ఇప్పుడు రండి.

197 అది ఈ దేశములో, లేదా ఈ స్థలములో ఉన్న ప్రతీ జుట్టు-కత్తిరించుకున్న స్త్రీని, పైన ఇక్కడికి వచ్చేలా చేయవలసియున్నది. అది ఖచ్చితంగా నిజము. అది,

"నేను—నేను—నేను—నేను రాగోరుతున్నాను, బ్రెన్హామ్ సహోదరుడా, నా తలవెంట్రుకలను పెంచుకోవాలని నేను కోరుతున్నాను," అని నిజంగా చెప్పేంత కృప మీకు లేదని అది చూపిస్తుంది. అది...."నేను...సరే, దానిని చేయడానికి నాకు కృప లేదు."

ఏంటీ, మీరు ఇట్లంటారు, "అసలు దానితో దీనికి ఏమైనా సంబంధం ఉన్నదా?"

198 ఈ మధ్యనే, ఒక నిజమైన గొప్ప సేవకుడు నా దగ్గరకు వచ్చి, మరియు ఇట్లన్నాడు, "బ్రెన్హామ్ సహోదరుడా, నేను నీ మీద చేతులను ఉంచగోరుతున్నాను." ఇంకా ఇట్లన్నాడు, "ప్రతి ఒక్కరూ నిన్ను ఒక ప్రవక్తగా భావిస్తున్నారు."

నేను ఇట్లన్నాను, "నేను ఒక ప్రవక్తనని నేను ఎన్నడూ చెప్పలేదు."

199 అతడు ఇట్లన్నాడు, "కానీ ప్రజలు నిన్ను అలా భావిస్తున్నారు. పొట్టి నిక్కర్లు వేసుకోవడం గురించి, నీవు ఆ స్త్రీలను ఎప్పుడూ ఖండిస్తూ ఉంటావు," మరియు—మరియు, ఓ, అతడు ఒక పెంతెకొస్తువాడై యున్నాడు. మరియు ఇట్లన్నాడు, "పొట్టి నిక్కర్లు వేసుకోవడం గురించి, మరియు వారి జుట్టును కత్తిరించుకోవడం గురించి, మరియు అటువంటివాటి గురించి ఖండిస్తూ ఉంటావు." ఇట్లన్నాడు, "అది నీ పని కాదు."

నేను ఇట్లన్నాను, "అలాగైతే మరి అది ఎవరి పని?"

200 మరియు అతడు ఇట్లన్నాడు, "ఆ ప్రజలకు, ఆ స్త్రీలకు గొప్ప ఆత్మీయ వరములను ఎలా పొందుకోవాలన్నదాని గురించి, మరియు ప్రజలకు ఎలా సహాయము చేయాలన్నదాని గురించి నీవెందుకని బోధించకూడదు, అలా చేయడానికి బదులు..." ఇట్లన్నాడు, "వారు నిన్ను గౌరవిస్తున్నారు. నీవు వారికి ఏమి చెప్పినా, వారు నిన్ను నమ్ముతారు." ఇట్లన్నాడు, "వారిని ఎప్పుడూ ఖండించడానికి బదులు, గొప్ప ఆత్మీయ వరములను ఎలా పొందుకోవాలో మరియు వాటి ద్వారా ప్రజలకు ఎలా సహాయం చేయాలో నీవు వారికి ఎందుకని చెప్పకూడదు?"

201 నేను ఇట్లన్నాను, "వారు కనీసము తమ అ ఆ లు నేర్చుకోనప్పుడు, నేను వారికి ఆల్జీబ్రాను ఎలా నేర్పించగలను?" చూశారా? చూశారా?

202 మీరు క్రింద స్థాయి నుండి మొదలుపెట్టాలి, పశ్చాత్తాపపడండి లేనియెడల నశించిపోతారు! ఇప్పుడు నిర్ణయం మీరే తీసుకోండి, పశ్చాత్తాపపడండి లేదా నశించిపోండి! యేసుక్రీస్తు ఇక్కడ, రాత్రి వెంబడి రాత్రి తననుతాను పూర్తిగా గుర్తింపజేసుకున్నాడు. మరియు ఈ రాత్రిని ఈ రక్షణ కొరకు మనం అప్పజెప్పుకుంటున్నాము. ఇక్కడికి రావడానికి కేవలం కొన్ని అడుగుల దూరమే ఉంది, మరియు నేను వేచియుండటానికి చాలా సమయం ఉంది.

203 బర్మింగ్హామ్, గుర్తుంచుకోండి, నేను మీ రక్తాపరాధిని కాను. నేను నిర్దోషిని. మరియు మీరు నిజంగా పరిశుద్ధాత్మను కలిగియున్నట్లైతే, ఇప్పుడు రావడానికి మీరు ఒక అవకాశమును కలిగియున్నారు. మరియు మీకు ఆత్మీయ మతిమరుపు రావడానికి కారణమైన ఏదో ఒక సంఘశాఖ-వ్యవస్థతో మీరు

బాధపడుతున్నారంటే, మీరెందుకని రాకూడదు? యేసే నివారణయైయున్నాడు. మీరు రారా?

204 ఇప్పుడు కొందరు ప్రజలు బాల్కనీనుండి లేచివెళ్ళారు. వారు ఎక్కడున్నారని, బయటకు వెళ్తున్నారా లేదా బలిపీఠము వద్దకు వస్తున్నారా అని చూడటానికి నేను వేచియున్నాను. క్రింద ఇక్కడున్న మీరు, పైకి రండి. అది నిజము. ఇక్కడున్న మీరు, వచ్చి ఇక్కడ బలిపీఠము చుట్టూ నిలబడండి, "ఇక దీనితో నా విషయము అయిపోయినది," అని చెప్పండి. అవును, వారు వస్తున్నారు, ఇద్దరు స్త్రీలు. అది మంచిది.

205 ఇప్పుడు నేరుగా పైకి వచ్చేయండి. దానినుండి కేవలం కొన్ని మెట్ల దూరంలో ఉన్నారు. మరియు ఆ మెట్లే వ్యత్యాసమును కలిగించవచ్చును.

206 ఇప్పుడు, చూడండి, నేను మిమ్మల్ని ఒకటి అడుగగోరుతున్నాను. ఒకవేళ ఆయన ఈ రాత్రే వచ్చినట్లైతే ఏమిటి? "ఓ," ఇట్లంటారు, "ఆయన రావడంలేదు." ఆయన వస్తున్నాడో లేదో నాకు తెలియదు. ఇది చివరి సూచనైయున్నది. గుర్తుంచుకోండి, **యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు!** నేను దానిని పలికినప్పుడు అది నిజము కాకుండాపోడాన్ని మీరు ఎప్పుడైనా చూశారా? మీరు మీ చివరి సూచనను చూస్తున్నారు. అది లేఖనానుసారమైనది. పెంతెకొస్తూ, మీరు మీ చివరి సూచనను చూశారు. మరి ఎత్తబడుట తర్వాత ఆయన ఇశ్రాయేలుకు ఏమి వాగ్దానము చేశాడో దానితో కలగలుపు అవ్వకండి; అది మీరు కాదు. అప్పటికి, మీ పని అయిపోయినది. చూశారా? ఇప్పుడే మీ దినమైయున్నది. ఇప్పుడే మీ సూచనైయున్నది. ఇప్పుడే మీ సమయమైయున్నది. దానిని తిరస్కరించకండి. అలా చేయకండి. మీరు రావడం మంచిది. నేను దేవుని సేవకుడనని మీరు నమ్ముతున్నారా? గుర్తుంచుకోండి.

207 బర్మింగ్‌హామా, ఇంతకంటే చక్కని ప్రజలను నేను ఎన్నడూ కలవలేదు. మీరు, నేను నా జీవితంలో కలవగోరే అత్యంత చక్కని ప్రజలైయున్నారు, అయితే మీకు ఒక ఉజ్జీవము అవసరమైయున్నది. మీరు మరణిస్తున్నారు. మీరు ఆత్మీయ మతిమరుపును తీసుకుంటున్నారు. మీరు మరణిస్తున్నారు. అలా చేయకండి. మీరు కలిగియున్నదానిని ఉజ్జీవపరచుకోండి. యేసు వచ్చేలోపు, వెంటనే, దానిని మరలా పైకి తీసుకొనిరండి.

208 మంచిది, వారు---వస్తూనే ఉండండి. ప్రభువు పిలుస్తున్నవారందరూ, పైన ఇక్కడికి వచ్చేవరకు, వారిని వస్తూనే ఉండనివ్వండి. ఇప్పుడు రండి.

209 ఆ మతిమరుపును వదిలించుకోండి. దానిని స్వస్థపరచడానికి, దానిని మీనుండి తీసివేయడానికి ఆ గొప్ప వైద్యుడు ఇప్పుడు ఇక్కడ ఉన్నాడు. ఆయన ఇక్కడ ఉన్నాడని ఆయన ఋజువుచేశాడు. మీ చెయ్యిని పైకెత్తి, "ఆయన దీనిని చేస్తాడని ఆయన చెప్పాడని; నేను దానిని నిజముగా నమ్ముతున్నాను" అని చెప్పడం ద్వారా, ఎంతమంది దానిని గుర్తిస్తారు? చూశారా? ఇప్పుడు ఆయన ఇక్కడ ఉన్నాడు. చూశారా? చూశారా? మీరు నమ్మండి.

210 మరియు మీరు మరణిస్తూ ఒక ఉజ్జీవముయొక్క అవసరతను కలిగియున్నారని, నేను మీకు సత్యమునే చెప్తున్నానని ఎంతమందికి తెలుసు? చూశారా? అది సత్యమైయున్నది.

211 మీరు చక్కని ప్రజలైయున్నారు. ఇంతకంటే శ్రేష్ఠమైనవారిని మీరు కనుగొనలేరు. దిగువున ఇక్కడ, ఈ పాత దక్షిణాది చొక్కాల క్రింద కొట్టుకునే గుండెలకంటే శేష్టమైన హృదయాలు లేనే లేవు. అది సరియే, నిజమైన ప్రజలైయున్నారు! కానీ, జనులారా, మీరు వెంటనే, మేల్కోవడం మంచిది! మీరు అనుకోని ఘడియలో, అది జరుగవచ్చును. అది జరుగకపోవచ్చును; నాకు తెలియదు.

212 కానీ, గుర్తుంచుకోండి, మీరు మీ చివరి హెచ్చరికను పొందుకుంటున్నారు, కాబట్టి పారిపోడానికి మీకు సమయమున్నప్పుడే పారిపోండి. ఇప్పుడే రండి. వారు వస్తున్నంత సమయం, నేను వేచిచూస్తూనే ఉంటాను, ఎందుకంటే ఒక్కరైనా ఉండవచ్చును...ఒక్క ఆత్మ పదివేల ప్రపంచములంత విలువగలది. మరియు ప్రజలు ఒప్పించబడుతున్నంతవరకు...

213 మీరు మీ భేదాభిప్రాయాలను తొలగించి మరియు ఆ స్వార్థమంటటినీ దూరం చేసుకొని, మరియు పరిశుద్ధాత్మను స్వీకరించినట్లైతే; ఇది ఇక్కడ చుట్టుప్రక్కలనున్న ప్రతీ సంఘమును కదిలించేంత ఒక గొప్ప ఉజ్జీవములోనికి పెల్లుబకటాన్ని నేను చూడగోరుతున్నాను. మీరు దానిని నమ్ముతున్నారని మీరు చెప్పుకున్నారు. మీరు దానిని నమ్ముతున్నారని మీరు చెప్పుకున్నారు, మరియు, దానినది గుర్తింపజేసుకునే సమయం వచ్చేసరికి, అప్పుడు మీరు ఒకరినుండి ఒకరు వేరైపోతున్నారు. దేవుని వాక్యముతో మన హృదయాలను జతచేసుకొని మరియు ఎందుకని సత్యమును నమ్మకూడదు? విషయం అదే. మీరు కేవలం మరణిస్తూనే ఉంటారు, మరణిస్తూనే ఉంటారు, మరియు మీరు నేరుగా లవొదికయలోనికి వెళ్తున్నారు. ఆయన వాగ్దానము చేసినది సరిగ్గా అదేయైయున్నది, అది ఆ విధంగానే ఉంటుంది. ఇప్పుడు మీరు రారా? ఇదే అనుకూల దినము. ఇదే అనుకూల సమయము. పరిశుద్ధాత్మ ఏమి చేస్తాడో గమనించండి.

214 ఇప్పుడు, ఈ ప్రజలపట్ల ఆసక్తి కలిగియున్న సేవకులందరూ వచ్చి, నాతో కూడా ప్రార్థించాలని, నేను కోరుతున్నాను. ఈ ప్రజలపట్ల ఆసక్తిగల సేవకులందరూ, పైన ఇక్కడికి రండి. రండి, నేరుగా ఇక్కడికి రండి, మరియు ప్రజల మధ్యకు రండి, సేవకుడైనా లేదా వ్యక్తిగతంగా పరిచర్య చేసేవారైనా, వ్యక్తిగత పరిచర్య బాగుగా చేసే ఒక వ్యక్తియైనా, ఈ స్త్రీలతో ఇప్పుడు నిలబడగోరుతున్న ఒక స్త్రీయైనా రండి. పరిశుద్ధాత్మ ఈ స్థలములోకి రాబోతున్నాడని, సరిగ్గా ఇప్పుడు ఇక్కడికి వచ్చి ఈ ప్రజల మధ్య తననుతాను గుర్తింపజేసుకుంటాడని, నా హృదయమంతటితో నేను నమ్ముతున్నాను.

215 ఇప్పుడు మొదటిగా, ఇక్కడున్న ఈ ప్రజలకు సూచనలను ఇవ్వనీయండి. ఇప్పుడు, స్నేహితులారా, మీరు దేనికొరకు ఇక్కడికి వచ్చినప్పటికీ, అది ఆయనకు తెలుసు. మరియు నేను దానిని మీకు నిరూపించగలను, అది, ఒక్కొక్కరిని తీసుకొని, ఈ వేదిక మీదకు మిమ్మల్ని తీసుకువస్తుంది, మరియు ఆయన తెలియజేయనిది ఒక్క విషయము కూడా ఉండదు. ఇప్పుడు నేను ఒక చిన్న పిల్లవాడిగా ఉన్నప్పటినుండి అది ఆ విధంగా జరిగినది. ఆ వరము విషయములో ఎలాంటి ప్రశ్న లేదు. అయితే ప్రశ్న ఏమిటంటే, మీరు దానిని పొందుకోగలరా? మీరు దానిని నమ్ముతున్నారా? ఇప్పుడు ఆయన ఇక్కడ ఉన్నాడు. సరి, ఆయన

ఇక్కడ ఉన్నట్లైతే, అప్పుడు ఒకే ఒక్క విషయము జరుగుతుంది, ఆయన తన మాటను నిలబెట్టుకుంటాడు. అలాగైతే మీరు దానిని పొందుకుంటారని నమ్మండి, మరియు దానిని అంగీకరించండి, మరియు లేచి "ప్రభువైన దేవా, దానిని అంగీకరించడానికి నేను ఇక్కడ ఉన్నాను," అని చెప్పండి, మరియు అది జరిగేవరకు సరిగ్గా అక్కడే ఉండండి.

216 ఒకసారి, ఒక మొక్కజొన్న పొలములో బడ్డీ రాబిన్‌సన్ చెప్పినట్లుగా ఉన్నది. అతడు ఇట్లన్నాడు, "ప్రభువా, నీవు గనుక నాకు పరిశుద్ధాత్మను అనుగ్రహించకపోతే, నీవు తిరిగి వచ్చినప్పుడు సరిగ్గా ఇక్కడ ఒక ఎముకల కుప్ప పడియుండటాన్ని నీవు కనుగొంటావు." అతడు ఎంతో తీవ్రమైన పట్టుదలతో ఉన్నాడు. మరియు మీరు అది లేకపోతే ఇక బ్రతుకలేరనే స్థితికి వచ్చేవరకు దేవుని దగ్గరనుండి మీరు ఏమీ పొందుకోలేరు.

217 ఇప్పుడు, ఈ దినమున పంటను మీరు గమనించారా, ఈనాడు మనము ఏమి చేస్తున్నామో మీరు గమనించారా? మనము, వాస్తవానికి, మనలో దేవుడిని ఎంతగా కలిగియున్నామంటే మనము వేదిక మీదకు వచ్చి, "అవును, బహుశా నేను ఇక్కడికి రావడం మంచిదేమో," అని అంటాము. ఇప్పుడు ఇది ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అనుభవమైయున్నది. "అవును, నేను అక్కడికి వెళ్ళి మరియు అక్కడ నిలబడటం మంచిదనుకుంటా." ఇంకా ఇట్లుంటారు, "సరి, సరి, నాకు తెలియదు. ఇదిగో నేను ఇక్కడ ఉన్నాను, చూడండి." హమ్! ఉండటానికి ఎటువంటి ఒక పరిస్థితి! ఎటువంటి అగ్ని మండటంలేదు. ఎటువంటి ఆసక్తి లేదు. "దానిలోకి సాగిపోదాము!" అనే పట్టుదల కొంచెమైనా లేదు. మరియు ఒక సువార్తికుడిగా, దేవుని ప్రజలను అలాంటి స్థితిలో చూడటానికి అది నన్ను చంపేస్తుంది. మనం మండుతూ ఉండవలసియున్నాము.

218 అయితే, మీరు చూడండి, అదేమిటి? అది ఖచ్చితంగా నేను మీకు చెప్పినదేయైయున్నది. ప్రకటన 3, "నీవు నులివెచ్చనగా ఉన్నావు. మరియు," ఇంకా ఆయన ఇట్లన్నాడు, "నీవు నులివెచ్చనగా ఉన్నావు గనుక, నేను నిన్ను నా నోటనుండి ఉమ్మివేయ నుద్దేశించుచున్నాను." అది నిజము? ఆయన చెప్పినది అదేయైయున్నది. మరియు, ఆయన దానిని చెప్పినట్లైతే, మరి ఆయన చేయబోతున్నది అదేయైయున్నది. కాబట్టి మనము ఆ గుంపుకు చెందకుండా ఉందాము.

219 మీరు ఇక్కడ, అవసరతతో ఉన్నారు. మనము దానిని పొందుకుందాము, లేదా సరిగ్గా ఇక్కడే, చనిపోదాము. అది నిజము. మనం దానిని పొందుకుందాము, లేదా చచ్చిపోదాము.

220 ఇప్పుడు, నా ప్రియమైన సహోదరుడా, సహోదరీ, నేను క్రిందకు వచ్చి మరియు మీరు ఏదైనా చేయడానికి మీకు సహాయం చేయగలిగితే, నేను నిశ్చయంగా దానిని చేస్తాను. ఇప్పుడు, ఒక వరము ద్వారా, మీరు దేనికొరకు ఇక్కడ ఉన్నారో నేను మీకు చెప్పగలను. పరిశుద్ధాత్మ ద్వారా, దేవునియొక్క ఆత్మ ద్వారా, అది ఏమిటనేదానిని, మీరు దేనికొరకు వచ్చారనేదానిని, మీరు ఏమి చేశారనేదానిని, మీ భవిష్యత్తు ఏమియుంటుంది అనేదానిని, లేదా అటువంటి దేనినైనా నేను మీకు చెప్పగలను; కానీ అది సమస్యను పరిష్కరించదు. మీయంతట మీరే, దీనిని అంగీకరించవలసియున్నారు. అది మీరే అయ్యుండవలసియున్నది!

221 ఇప్పుడు మీరు సిద్ధంగా ఉన్నారా? మీ చేయి పైకెత్తి, ఇట్లు చెప్పండి, "నేను సిద్ధంగా ఉన్నాను. సరిగ్గా ఇక్కడే మరణించడానికి నేను సిద్ధంగా ఉన్నాను." ఇప్పుడు మీరు ఆ ఉద్దేశ్యాన్ని కలిగియుంటేనే తప్ప దానిని చేయకండి. "దేవుని దగ్గర నుండి నాకు కావలసినది పొందుకోడానికైనా, లేదా సరిగ్గా ఇక్కడే చనిపోడానికైనా నేను సిద్ధంగా ఉన్నాను." ఆమేన్. మీరు నిజముగా సిద్ధంగా ఉన్నారా?

222 అలాగైతే అంతటా, జనసమూహము లేచి నిలబడండి. ఇప్పుడు మనమందరము, కలిసికట్టుగా, మనము కలిసికట్టుగా ఐక్యమవుదాము. మనము ప్రార్థించుకుందాము. మరియు మనము---ఇప్పుడు సేవకులైన మీరు, ప్రతి ఒక్కరూ, ఇక్కడ ఈ ప్రజల దగ్గరికి రండి, మరియు ఇప్పుడు మీరు క్రీస్తుయొక్క హస్తములకు ప్రతినిధులుగా ఉన్నారు.

223 పరిశుద్ధాత్మ కోరుచున్న మీరు, ఆ అనుభవమును కోరుచున్న మీరు, మరి ఒక ఉద్రేకమును కాదు గాని; మీరు పరిశుద్ధాత్మను, ఆ జీవమును, మీయందున్న ఆ జీవకణమును కోరుతున్నారు. మరియు మిమ్మల్ని మీరు గుర్తుపట్టుకోకుండా చేస్తున్నట్టి ఆ మతిమరుపు నుండి మీరు——మీరు విడుదల పొందగోరుతున్నారు; మీరు ఎక్కడ నిలబడ్డారో మీకు తెలియదు; మీరు ఏమిటో మీకు తెలియదు; సరిగ్గా ఇప్పుడే దానినుండి విడుదల పొందుదాము! మీ కొరకు ఇక్కడ ఒక క్రొత్త జన్మ ఉన్నది, ఒక నిజమైన, అసలైన క్రొత్త జన్మ ఉన్నది.

224 ఇప్పుడు మనము ఈ ప్రజలపై మన చేతులను ఉంచుదాము. మనము, ప్రతి ఒక్కరము, మన చేతులను పైకెత్తి మరియు ఏకమనస్సుతో ప్రార్థించుదాము.

225 పరలోకపు తండ్రీ, ప్రభువైన యేసుక్రీస్తు నామములో, దానిని దయచేయుము ప్రభువా, అదేమిటంటే, యేసుక్రీస్తు నామములో, పరిశుద్ధాత్మ వేగముగా వీచు బలమైన గాలివలె కుమ్మరించబడినట్లుగా, ఈ రాత్రి, ఈ శనివారము రాత్రి పరిశుద్ధాత్మ వచ్చును గాక. ఈ ప్రజలు పరిశుద్ధాత్మలోనికి బాప్తిస్మము పొందుదురు గాక. దేవునియొక్క అగ్ని మరియు శక్తి వారిని విడిచిపెట్టకుండును గాక. ఉదయమున వారు ఇక్కడికి వచ్చినట్లైతే, మరి వారు పరిశుద్ధాత్మ వచ్చేవరకు వేచియుంటూనే, వేచియుంటూనే ఉందురు గాక.

226 ఆలోచన అదేయైయున్నది! అంతే! అదిగో అది వస్తున్నది. అది పరిశుద్ధాత్మ రావడమేయైయున్నది. (నేను దానిని చేశాను. నాకు అది తెలుసు.)

అంతే. ఇప్పుడు దానిని నమ్మండి! దానిని అంగీకరించండి! ఆయనయొక్క ఆశీర్వాదములతో నింపబడండి.

64-0411 ఆత్మీయ మతిమరుపు
నేషనల్ గార్డ్ ఆర్మొరి
బర్మింగ్‌హామ్, అలబామా అమెరికా

TELUGU

©2026 VGR, ALL RIGHTS RESERVED

VOICE OF GOD RECORDINGS, INDIA OFFICE
19 (NEW NO: 28) SHENOY ROAD, NUNGAMBAKKAM
CHENNAI 600 034, INDIA
044 28274560 • 044 28251791
india@vgroffice.org

VOICE OF GOD RECORDINGS
P.O. BOX 950, JEFFERSONVILLE, INDIANA 47131 U.S.A.
www.branham.org

కాపిరైట్ గమనిక

సర్వహక్కులు మావి. యేసుక్రీస్తు యొక్క సువార్తను వ్యాప్తిచేయు ఒక సాధనముగా, వ్యక్తిగత ఉపయుక్తము కొరకు ఉచితముగా పంచిపెట్టుట కొరకు హో ప్రింటర్ మీద ఈ పుస్తకమును ముద్రించవచ్చును. ఈ పుస్తకము అమ్మకూడదు. అమితముగా ప్రత్యుత్పత్తి చేయకూడదు. వెబ్ సైట్ లో పెట్టకూడదు. మరలాపొందుకొనుటకు రిట్రైవల్ సిస్టంలో ఉంచకూడదు. ఇతర భాషలలోకి తర్జుమాచేయకూడదు, లేక వాయిస్ ఆఫ్ గాడ్ రికార్డింగ్స్ వారి వ్రాతపూర్వకమైన అనుమతి తెలియబడకుండ నిధులు సేకరించుటకు ఉపయోగించ కూడదు.

మరింత సమాచారము కొరకు లేక యితరత్రా పరికరముల కొరకు దయచేసి సంప్రదించగలరు:

VOICE OF GOD RECORDINGS, INDIA OFFICE
19 (NEW NO: 28) SHENOY ROAD, NUNGAMBAKKAM
CHENNAI 600 034, INDIA
044 28274560 • 044 28251791
india@vgroffice.org

VOICE OF GOD RECORDINGS
P.O. BOX 950, JEFFERSONVILLE, INDIANA 47131 U.S.A.
www.branham.org